తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

అనంతపురం | కర్నూలు | కడప | చిత్తూరు | ప్రకాశం | గుంటూరు | విజయవాడ | హైదరాబాద్

సంపుటి : 01 సంచిక : 107 ఎడిటర్. అచుకట్ల ఖాదర్ బాషా పేజీలు : 08 బుధవారం 18 - 11 - 2026వెల రూ. 2 రూ/

సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు
ఎన్వోసీ కోరిన రేవంత్ రెడ్డి

- సానుకూలంగా స్పందించిన ఛత్తీస్‌గఢ్ సీఎం
- గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్వోసీ ఇవ్వాలని ఛత్తీస్‌గడ్ సీఎం విష్ణుదేవ్ సాయిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు
- ఎన్వోసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు హామీ ఇచ్చారు
- ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయితో సీఎం రేవంత్ రెడ్డి భేటీ



హైదరాబాద్ :

సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాల వేగం పెంచింది. రెండు రోజుల క్రితం ప్రధాని నరేంద్ర మోదీతోనూ చర్చించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ దిల్లీ నుంచి నేరుగా రాయ్‌పూర్ వెళ్లి ఛత్తీస్‌గడ్ సీఎం విష్ణుదేవ్‌సాయితో భేటీ అయ్యారు. సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణానికి నిరభ్యంతర పత్రం ఇవ్వాలని ఛత్తీస్‌గడ్ సీఎంను రేవంత్ రెడ్డి కోరారు. ఎల్‌నినో పరిస్థితుల వల్ల తెలంగాణలో నీటి అవసరాలు పెరిగే అవకాశం ఉందని సీఎం వివరించారు. సమ్మక్క సాగర్ బ్యారేజీలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతి ఇవ్వడంతో పాటు ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన అనుమతులకూ సహకరించాలని కోరారు.ఛత్తీస్‌గఢ్‌లో భూసేకరణ, పరిహారం, పునరావాసానికి అవసరమైన నిధులను నిబంధనల ప్రకారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఛత్తీస్‌గడ్ ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి ఎన్వోసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు హామీ ఇచ్చినట్లు తెలంగాణ సీఎంవో తెలిపింది. ఛత్తీస్‌గడ్ ముఖ్యమంత్రిని కలిసిన బృందంలో రేవంత్ రెడ్డితో పాటు ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు ఉన్నారు. గోదావరి నదిపై నిర్మించిన సమ్మక్క సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావాలంటే - మిగతా 2 లో

తెలంగాణ ఇచ్చింది సోనియమ్మే అయితే..
ఆత్మకథలో ఎందుకు రాయలేదు?



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సోనియా ఆత్మకథలో తెలంగాణ ఏర్పాటు ప్రస్తావన లేదన్న కేటీఆర్
- తెలంగాణ ఇచ్చింది సోనియమ్మే అయితే సమాధానం చెప్పాలని డిమాండ్
- ఇది ప్రజల పోరాట ఫలితం.. సోనియా దయాభిక్ష కాదని స్పష్టీకరణ
- ఉద్యమ కాలం నాటి పాదయాత్రను గుర్తు చేసుకుంటూ పోస్ట్

హైదరాబాద్ :

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీని లక్ష్యంగా చేసుకుని సూటి ప్రశ్న సంధించారు. సోనియా గాంధీ గుండెల్లో తెలంగాణ ఉంటే, ఆమె - మిగతా 2 లో



హైదరాబాద్‌లో
రోడ్ల పండుగ

- హాజరుకానున్న 3000 మందికి పైగా దేశ, విదేశీ ప్రతినిధులు
- హైదరాబాద్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ 85వ వార్షిక సదస్సు
- 19న ప్రారంభించనున్న సీఎం రేవంత్ , కేంద్ర మంత్రి గడ్కరీ
- తెలంగాణ సంస్కృతి, అభివృద్ధిని చాటేలా ప్రత్యేక ఏర్పాట్లు

హైదరాబాద్ :

భారత రహదారుల కాంగ్రెస్ (ఐఆర్‌సీ) 85వ వార్షిక సదస్సుకు హైదరాబాద్ నగరం వేదికైంది. ఈ నెల 19 నుంచి - మిగతా 2 లో

పోటీ కాదు, సహకారమే
మన భవిష్యత్తు



- ఆసియాన్ సదస్సులో ప్రధాని మోదీ
- భారత్ అభివృద్ధి, ఆసియాన్ శ్రేయస్సు ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయన్న మోదీ
- 'యాక్ట్ ఈస్ట్' విధానంతో ఇరుపక్షాల మధ్య బంధం మరింత బలోపేతం
- వికసిత భారత్ 2047, ఆసియాన్ విజన్ 2045 లక్ష్యాలు కీలకం
- ప్రస్తుత ప్రపంచానికి శాంతి, స్థిరత్వం ఎంతో అవసరమని వ్యాఖ్య

ఢిల్లీ :

భారత్ అభివృద్ధి, ఆసియాన్ దేశాల శ్రేయస్సు ఒకదానితో ఒకటి గాఢంగా ముడిపడి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇరుపక్షాల భవిష్యత్తును పోటీతత్వం కాకుండా సహకారం నిర్దేశించాలని ఆయన పిలుపునిచ్చారు. మనీలాలో జరిగిన 23వ ఇండియా-ఆసియాన్ సదస్సులో మోదీ ప్రసంగించారు.భారత్, ఆసియాన్ దేశాలు కలిస్తే ప్రపంచ జనాభాలో దాదాపు నాలుగో వంతు ఉంటాయని మోదీ గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో మన - మిగతా 2 లో

కెరీర్‌లో ఇది
మంచి అవకాశం

- మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల
- 60 వేల మంది ఉద్యోగులకు వాలంటరీ ఎగ్జిట్ ప్రకటించిన మైక్రోసాఫ్ట్
- భారత్, అమెరికా సహా నాలుగు దేశాల్లోని సిబ్బందికి అవకాశం
- ఏఐ విస్తరణతో పనితీరులో వస్తున్న పెను మార్పులే కారణమన్న సత్య నాదెళ్ల
- కెరీర్‌లో మార్పు కోరుకునే వారికి ఆర్థిక వెసులుబాటు కల్పించడమే లక్ష్యం
- సంస్థలో కొనసాగే వారికి సరికొత్త అవకాశాలు వస్తాయని వెల్లడి





మణుగూరులో
వరుస ప్రకంపనలు

- ఊగిన ఇళ్లు, హడలిపోయిన ప్రజలు
- మణుగూరు ప్రాంతంలో వరుసగా రెండుసార్లు భూప్రకంపనలు
- ఉదయం సమయంలో భారీ శబ్దాలు రావడంతో ఇళ్ల నుంచి పరుగులు తీసిన స్థానికులు
- భూకంప తీవ్రతపై ఇంకా అధికారిక సమాచారం విడుదల చేయని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ
- గోదావరి లోయ ప్రాంతంలో గతంలోనూ నమోదైన పలు స్వల్ప ప్రకంపనల ఘటనలు

హైదరాబాద్ :

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పరిసర ప్రాంతాల్లో నేడు (నవంబర్ 17) వరుసగా భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఉదయం సమయంలో స్వల్ప వ్యవధిలోనే రెండుసార్లు భూమి కంపించడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఏం జరుగుతుందో అర్థంకాక ఇళ్ల నుంచి ఒక్కసారిగా రోడ్లపైకి పరుగులు తీశారు.స్థానికులు తెలిపిన - మిగతా 2 లో

మోదీ చాలా
'టఫ్ మ్యాన్'



- క్వాడ్ వేదికగా భారత ప్రధానిపై ట్రంప్ వ్యాఖ్యలు
- మనీలాలో జరిగిన క్వాడ్ సదస్సులో మోదీని 'గట్టి వాడు'గా అభివర్ణించిన ట్రంప్
- క్వాడ్ సమావేశంలో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాధినేతల చర్చలు
- 85 మిలియన్ డాలర్ల వ్యయంతో ఏఐ యాక్సిలరేటర్ ప్రారంభమిస్తామన్న ట్రంప్
- సముద్ర జలాల రక్షణ కోసం 4 దేశాల సైన్యాలతో ఉమ్మడి మిలిటరీ విన్యాసాలు
- అరుదైన ఖనిజాల ఉత్పత్తిలో భారత్, జపాన్ భాగస్వామ్యాన్ని కొనియాడిన ట్రంప్

ఢిల్లీ :

ఫిలిప్పీన్స్‌లోని మనీలా వేదికగా జరిగిన క్వాడ్ దేశాల సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రెండేళ్ల తర్వాత, ఆసియాన్ సదస్సు సందర్భంగా జరిగిన - మిగతా 2 లో

శబరిమలలో తిరుపతి తరహా మెగా ప్రాజెక్టు

- తిరుపతి మోడల్‌లో శబరిమల అభివృద్ధి.. కేరళ ప్రభుత్వం కీలక నిర్ణయం
- అయ్యప్ప భక్తులకు అత్యాధునిక వసతులు
- సమగ్ర మౌలిక వసతుల కల్పన
- కొచ్చి విమానాశ్రయంలో 5,000 చదరపు అడుగుల్లో ప్రత్యేక సేవా కేంద్రం
- భక్తుల రాకను మరో 50 శాతం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం



కేరళ :

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమలలో తిరుమల-తిరుపతి తరహాలో భారీ మౌలిక వసతుల ప్రాజెక్టును అమలు చేయనున్నట్లు కేరళ ముఖ్యమంత్రి పీడీ సతీశన్ ప్రకటించారు. శబరిమలకు వచ్చే అయ్యప్ప భక్తులకు సమగ్రమైన రీతిలో అత్యాధునిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఈ మెగా ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయం (సియాల్) ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శబరిమల యాత్రికుల సహాయ కేంద్రాన్ని (ఫెసిలిటేషన్ సెంటర్) ముఖ్యమంత్రి ప్రారంభించారు. - మిగతా 2 లో

ఏపీ వైపు దూసుకొస్తున్న
'అక్వాన్' తుపాను

- తీర ప్రాంతాలకు హెచ్చరిక!
- ఆగ్నేయ బంగాళాఖాతంలో అక్వాన్ తుపాను
- శుక్రవారం నెల్లూరు-తుని మధ్య తీరం దాటే సూచన
- తుపానుపై సీఎం చంద్రబాబు సమీక్ష, యంత్రాంగం అప్రమత్తం
- తీర ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక



అమరావతి :

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను ఏపీ తీరం వైపు దూసుకొస్తోంది. ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ తుపాను.. నేటి సాయంత్రానికి తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఎస్‌డీఎంఏ) వెల్లడించింది. గడిచిన ఆరు గంటల్లో గంటకు 3 కిలోమీటర్ల వేగంతో కదులుతున్నట్లు అధికారులు తెలిపారు.ప్రస్తుతం ఈ తుపాను చెన్నైకి 610 కి.మీ, మచిలీపట్నానికి 660 కి.మీ, విశాఖపట్నానికి 670 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉందని ఎస్‌డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ గురువారం (నవంబర్ 19) ఉదయానికి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. శుక్రవారం (నవంబర్ 20) మధ్యాహ్నం నాటికి నెల్లూరు, తుని మధ్య తీరం దాటవచ్చని భావిస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 120-130 కిలోమీటర్ల - మిగతా 2 లో

కోనసీమ ఓఎన్జీసీ బావి
మంటలు అదుపులోకి!



- కోనసీమ జిల్లా రాజోలులో అదుపులోకి వచ్చిన ఓఎన్జీసీ గ్యాస్ బావి మంటలు
- దాదాపు 10 గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేసిన నిపుణులు
- తెల్లవారుజామున 4:30 గంటల సమయంలో భారీ శబ్దంతో చెలరేగిన అగ్నికీలలు
- ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించిన సీఎం చంద్రబాబు
- పరిస్థితి అదుపులోకి రావడంతో ఊపిరి పీల్చుకున్న స్థానిక గ్రామాల ప్రజలు

ఆంధ్రప్రదేశ్‌కి ఆర్థిక
సాయం అందించండి

- ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలతో సీఎం చంద్రబాబు భేటీ
- నిర్మలా సీతారామన్‌కు సాయంపై సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
- ఢిల్లీలో సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు
- రాయలసీమ హార్టీకల్చర్ హబ్ ప్రాజెక్టుపైతో పాటు పలు అంశాలపై చర్చించారు
- తుపాను నష్టాలకు ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి
- నష్టానికి సంబంధించిన నివేదికలు ఇప్పటికే పంపామని వెల్లడి



అమరావతి :

ముఖ్యమంత్రి చంద్రబాబు దిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలోనే చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి ఏపీకి అందాల్సిన ఆర్థిక సాయం, రాయలసీమ అభివృద్ధికి కీలకమైన హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై కీలక చర్చలు జరిపారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు సంబంధించి ఇప్పటికే సిద్ధం చేసిన ప్రతిపాదనలను కార్యరూపంలోకి తీసుకురావాలని నిర్మలా సీతారామన్‌ను సీఎం కోరారు.వరుస తుపాన్లు, ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రం ఎదుర్కొంటున్న నష్టాలు, ఆర్థిక ఇబ్బందులను నిర్మలా సీతారామన్ దృష్టికి చంద్రబాబు తీసుకెళ్లారు. అర్నబ్, మురను తుపాన్ల వల్ల జరిగిన నష్టంపై ఇప్పటికే కేంద్రానికి సమగ్ర వివరాలు పంపామని గుర్తు చేశారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా తలెత్తిన సమస్యలను కూడా వివరించి ఏపీకి అవసరమైన ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

సంపాదకీయం

అమెరికా ఎన్నికల్లో సాంస్కృతిక పోరాటాల్లేవ్ !



అమెరికాలో జరిగిన మధ్యంతర ఎన్నికలు 'తప్పులు సరిదిద్దుకోవటం'లో ప్రజాస్వామ్యానికున్న బలాన్ని చాటాయి. చాలామంది ఊహించినదాని కంటే ఎక్కువ మార్పునే అమెరికా ఓటర్లు చూపారు. అధ్యక్షుడు తాననుకున్నది చేయటానికి కాంగ్రెస్‌లో మెజారిటీ కీలకం. లేదంటే విదేశీ విధానాల్లో, రక్షణ, దేశ భద్రత విషయాలలో తప్ప ఎగ్జిక్యూటివ్ ఆదేశాల ఫలితాలు పరిమితంగా ఉంటాయి. తాజా ఎన్నికల తర్వాత ప్రతినిధుల సభలో డెమోక్రాటిక్ పార్టీ భారీ మెజారిటీ సాధించింది. సెనేట్‌లోనూ దాని ఆధిక్యం గణనీయంగా పెరిగింది. అధ్యక్షుడి రెక్కలు కత్తిరించారు ప్రజలు. అటు ప్రతినిధుల సభ, ఇటు సెనెట్ రెండింటి లోనూ అధికార పార్టీకి భారీ వ్యతిరేకత వ్యక్తమవటం చాలా అరుదు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 1946, 1994, 2010లో మాత్రమే అలా జరిగింది.సరిహద్దుల్ని కట్టుదిట్టం చేసి, అక్రమ వలసల్ని ఆపుతారనే నమ్మకంతోనే ట్రంప్‌కి చాలామంది సంప్రదాయ డెమోక్రాట్ ఓటర్లు మద్దతిచ్చారు. కానీ దాన్ని క్రూరంగా, మానవ హక్కుల ఉల్లంఘనలా, ఆయా దేశాల్లో ఎన్నికైన ప్రభుత్వాధినేతల్ని అవమానించేలా మార్చి ట్రంప్ వ్యవహరించటం, వాచాలత్వాన్ని ప్రదర్శించటం అధిక శాతం అమెరికన్లకు ఆమోదయోగ్యం కాలేదు. అదేవిధంగా, ఇరాన్‌పై యుద్ధంతో అనుకున్న ప్రయోజనాలు నెరవేరకపోగా ఇంధన సంక్షోభాన్ని సృష్టించి, డీజిల్, గాసోలిన్ ధరలు పెరిగేట్టు చేసింది. అమెరికా విదేశాంగ విధానం ఆధారంగా ఆ దేశ ప్రజలు ఓటు వేయటం ప్రచ్ఛన్న యుద్ధకాలంలో కూడా అరుదు. కానీ, ఈసారి సుంకాలు, ఇరాన్ యుద్ధం పర్యవసానంగా స్థానికంగా ఇంధన ధరలు, ఇతర వ్యయాలు అధికమైనాయి. సగటు అమెరికన్లకు ఉపాధి అవకాశాలు పెరగకపోగా, వలసవిధానం అమలు తీరుతో రైతులు, చిన్నా పెద్దా సంస్థలు మానవ వనరులు దొరక్క ఇబ్బంది పడ్డాయి. వీటన్నింటికీ అధ్యక్షుడి అరాచక ధోరణే కారణమని ప్రజలు భావించారు. కంచుకోటల్లాంటి రాష్ట్రాల్లోనూ రిపబ్లికన్ పార్టీ ఓడింది. ఆఫ్రో అమెరికన్, లాటిన్ అమెరికన్ తొలిసారి గవర్నర్లుగా ఎన్నికయ్యారు. ఎనిమిది రాష్ట్రాల్లో రిపబ్లికన్‌లకు అనుకూలంగా 16 స్థానాలను ట్రంప్ పునర్విభజించినా కొత్త కాంగ్రెస్ సీట్లలో ప్రతి అయిదులో ఒకటి మాత్రమే రిపబ్లికన్లు గెలవగలిగారు. ప్రపంచ ప్రజాస్వామ్యానికి దిక్సూచిలాంటి తమ దేశం అప్రజాస్వామిక, భావోద్వేగ నిర్ణయాల బారిన పడటాన్ని సహించలేని అమెరికన్లు జాతి, మత, తెగ, వర్ణాలకు అతీతంగా ఏకమైనారు. తాము ఏ పార్టీకీ శాశ్వత ఓటర్లం కాదని, కొన్ని విలువలకి, తమ జీవితంలో బాగోగులకి అనుగుణంగా ఓటుని మార్చుకునే శక్తి ఉందని రుజువు చేశారు. ఇలా ఓటర్లు పార్టీ విధేయత కంటే విలువలు, ఉమ్మడి ప్రయోజనాలకి పెద్దపీట వెయ్యటం ప్రజాస్వామ్యం మనుగడకి, విజయానికి కీలకం. ఈ మధ్యంతర ఫలితాల తర్వాత రిపబ్లికన్ పార్టీ తిరిగి తన అంతర్గత ప్రజాస్వామ్యాన్ని సమీక్షించుకోవచ్చు. ట్రంప్ నీడ నుంచి పలువురు నేతలు బయటపడి ప్రజాస్వామ్యానికి కీలకమైన హేతుబద్ధతతో వ్యవహరించవచ్చు.ఈ ఎన్నికల్లో ఎటువంటి సాంస్కృతిక పోరాటాలూ లేవు. కేవలం అధ్యక్షుడి వ్యవహారశైలి వల్ల రోజువారీ జీవితంలో కష్టాలు పడుతున్నామన్న భావనే ప్రజల ఓటింగ్ సరళిని మార్చింది. టెక్సాస్, ఓహయో, జార్జియా లాంటి మితవాద రాష్ట్రాలన్నింటిలోనూ డెమోక్రాటిక్ పార్టీ ఘనవిజయం సాధించింది. ఫ్లోరిడాలో గవర్నరు ఎన్నికలో కేవలం 1.3శాతం ఓట్లతో డెమోక్రాట్లు ఓడారు. అమెరికన్ ప్రజల ఓటు డెమోక్రాటిక్ పార్టీలో వామపక్ష అతివాదులకు కాక, మధ్యేవాద, మితవాదులకి అనుకూలంగా పడింది. డెమోక్రాట్లు తమ పార్టీ బలాన్ని పెంచుకోవాలంటే ఈ మధ్యేవాద రాష్ట్రాలలో ప్రజలని ఆకట్టుకోవాలి. ఈ పరిస్థితి డెమోక్రాటిక్ పార్టీ భవిష్యత్తుకి, అమెరికన్ ప్రజాస్వామ్యానికి మంచి పరిణామం. అతివాదం, మితిమీరిన పక్షపాత ధోరణి, ద్వేష రాజకీయం స్థానంలో మితవాదం, మధ్యేమార్గం, ఇతర వర్గాలతో ఇచ్చిపుచ్చుకునే ధోరణి బలపడే అవకాశం ఉంది.

ఏపీ వైపు దూసుకొస్తున్న 'అక్వాన్' తుపాను

మొదటిపేజీ తరువాయి - వేగంతో గాలులు వీస్తాయని, గరిష్ఠంగా గాలి వేగం 145 కిలోమీటర్లకు చేరే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం ఉదయం అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను గమనాన్ని అడిగి తెలుసుకున్నారు. సాయంత్రానికి తుపాను తీవ్రతపై మరింత స్పష్టత వస్తుందని అధికారులు సీఎంకు వివరించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. విపత్తుల పట్ల ఆందోళన చెందకుండా, ప్రజలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా చూడాలన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు 'స్వర్ణ గ్రామ', 'స్వర్ణ వార్డు' సిబ్బంది ద్వారా నేరుగా సమాచారం అందించాలని సూచించారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలితే తక్షణమే పునరుద్ధరణ పనులు చేపట్టాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రజలకు భరోసా ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

కోనసీమ ఓఎన్జీసీ బావి మంటలు అదుపులోకి!

మొదటిపేజీ తరువాయి - డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తీవ్ర కలకలం రేపిన ఓఎన్జీసీ గ్యాస్ బావి మంటలు ఎట్టకేలకు అదుపులోకి వచ్చాయి. రాజోలు నియోజకవర్గ పరిధిలోని ఒక గ్యాస్ డ్రిల్లింగ్ బావిలో మంగళవారం తెల్లవారుజామున భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. రంగంలోకి దిగిన ఓఎన్జీసీ నిపుణుల బృందం దాదాపు 10 గంటల పాటు నిరంతరాయంగా శ్రమించి మంటలను పూర్తిగా నియంత్రించింది.నవంబర్ 17 తెల్లవారుజామున సుమారు 4:30 గంటల ప్రాంతంలో ఈ గ్యాస్ వెల్ వద్ద అకస్మాత్తుగా భారీ శబ్దం వినిపించింది. ఆ వెంటనే పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఆకాశాన్ని తాకేలా చెలరేగిన అగ్నికీలలను చూసి సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే ఓఎన్జీసీ అత్యవసర సాంకేతిక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశాయి. ప్రత్యేక పరికరాలు, నిపుణుల వ్యూహాలతో తీవ్రంగా శ్రమించి, మధ్యాహ్నం సమయానికి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.ఈ ప్రాంతంలో గ్యాస్ లీకేజీ తలెత్తిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే అప్రమత్తమైంది. ప్రమాద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, సమీప ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో యంత్రాంగం వేగంగా స్పందించి తగిన చర్యలు చేపట్టింది.దాదాపు 10 గంటల పాటు సాగిన ఆపరేషన్ విజయవంతమై, మంటలు పూర్తిగా ఆరిపోవడంతో పరిసర గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం ఘటనా స్థలంలో పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉందని, నిపుణులు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నారని అధికారులు స్పష్టం చేశారు.

తెలంగాణ ఇచ్చింది సోనియమ్మే అయితే.. ఆత్మకథలో ఎందుకు రాయలేదు?

మొదటిపేజీ తరువాయి - రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ఆత్మకథలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రస్తావన ఎందుకు లేదని నిలదీశారు. 'తెలంగాణ ఇచ్చింది సోనియమ్మే' అని చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రం సోనియా గాంధీ దయాభిక్ష కాదని, అది తెలంగాణ ప్రజల పోరాట ఫలితమని కేటీఆర్ స్పష్టం చేశారు. తాజాగా ఆయన ఎక్స్ వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు తెలంగాణ ఉద్యమ కాలం నాటి జ్ఞాపకాలను కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. ఉద్యమంలో భాగంగా 2011 నవంబర్ 16 నుంచి 21 వరకు తాను చేపట్టిన పాదయాత్రకు 15 ఏళ్లు పూర్తయినట్లు తెలిపారు.ఉద్యమ నాయకుడు కేసీఆర్ పిలుపు మేరకు ఆరు రోజుల పాటు సాగిన ఆ పాదయాత్ర తనకు ఓ గొప్ప జ్ఞాపకమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఉద్యమ చరిత్రను ప్రస్తావిస్తూ, సోనియా గాంధీపై, కాంగ్రెస్‌పై ఆయన ఈ విమర్శలు చేసినట్లు స్పష్టమవుతోంది.

మోదీ చాలా 'టఫ్ మ్యాన్'

మొదటిపేజీ తరువాయి - ఈ భేటీలో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాధినేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీని 'టఫ్ మ్యాన్' (చాలా గట్టి వాడు)గా అభివర్ణించారు. గతంలోనూ పలు అంతర్జాతీయ వేదికలపై మోదీ 'టఫ్ నెగోషియేటర్', తనకంటే చాలా బెటర్ అని ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.ఈ సమావేశంలో క్వాడ్ భాగస్వామ్యాన్ని ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన కూటమిగా ట్రంప్ అభివర్ణించారు. భవిష్యత్ సాంకేతికతకు దిశానిర్దేశం చేసేందుకు 85 మిలియన్ డాలర్ల నిధులతో ప్రత్యేక 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యాక్సిలరేటర్'ను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా సముద్ర జలాల్లో నియంత్రణ సామర్థ్యాలను పెంచేందుకు నాలుగు దేశాలు కలిసి త్వరలోనే ఉమ్మడి సైనిక విన్యాసాలు నిర్వహిస్తాయని స్పష్టం చేశారు. రేర్ ఎర్త్ (అరుదైన ఖనిజాలు) ఉత్పత్తిని పెంచడంలో అమెరికాతో పాటు భారత్, జపాన్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని, రాబోయే 10 నెలల్లో తమకు అవసరమైన అన్ని వనరులు సమకూరుతాయని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు.దానైనా పర్యటనలో భాగంగా జిన్‌పింగ్, పుతిన్‌లతో త్రైపాక్షిక అణు చర్చలు జరిపి ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు ప్రయత్నిస్తానని ట్రంప్ వెల్లడించారు. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో భేటీకి అవకాశం ఉందని, ఇరాన్ అణ్వాయుధాలు సాధించకుండా గట్టి నిఘా ఉంచామని తెలిపారు. మరోవైపు, ఎన్విడియా జాతీయ భద్రతా ప్రతిపాదనను స్వాగతిస్తూనే, ఇటీవల రాజీనామా చేసిన జెన్సన్ హువాంగ్ తిరిగి కంపెనీ సీఈవోగా బాధ్యతలు చేపడితే తనకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు.

శబరిమలలో తిరుపతి తరహా మెగా ప్రాజెక్టు

మొదటిపేజీ తరువాయి - ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కేరళలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని విస్తృతంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. అయ్యప్ప భక్తులు శబరిమలలో దర్శనం ముగిసిన వెంటనే వెనుదిరగకుండా, రాష్ట్రంలోని ఇతర ప్రముఖ ఆలయాలను కూడా సందర్శించేలా ఒక ప్రత్యేక నెట్‌వర్క్‌ను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రణాళిక ద్వారా శబరిమలకు వచ్చే భక్తుల సంఖ్య సుమారు 50 శాతం మేర పెరిగే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.శబరిమల దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల కల్పనపై ప్రస్తుతం కొనసాగుతున్న మండల పూజా సీజన్ ముగిసిన తర్వాత ఒక ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే వృశ్చిక మాసం సీజన్ ప్రారంభానికి ముందే అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశామని, పంబ, సన్నిధానంలలో స్వయంగా సమీక్షలు నిర్వహించి ఏర్పాట్లను పర్యవేక్షించినట్లు ఆయన తెలిపారు.మరోవైపు, కొచ్చి విమానాశ్రయంలోని డొమెస్టిక్ అరైవల్ టెర్మినల్ సమీపంలో 5,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ భక్తులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. ఇక్కడ శబరిమలకు నేరుగా వెళ్లే కేరళ ఆర్టీసీ బస్సుల కోసం ప్రత్యేక బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ బస్సు సర్వీసులను కూడా ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు.దీంతో పాటు డిమాండ్‌కు అనుగుణంగా చార్టర్డ్ బస్సులు, హెలికాప్టర్ బుకింగ్ కౌంటర్, ట్రావెన్‌కోర్ దేవస్వోం బోర్డు హెల్ప్ డెస్క్, ప్రసాదం కూపన్ కౌంటర్లను ఇక్కడ అందుబాటులో ఉంచారు. వీటితో పాటు ప్రీపెయిడ్ ట్యాక్సీ బుకింగ్, శాకాహార భోజన శాల, ఎయిర్ కండిషన్డ్ విశ్రాంతి గదులు, ఉచిత వైఫై, విమానాల రాకపోకలను ఎప్పటికప్పుడు తెలియజేసే ఫ్లైట్ ఇన్ఫర్మేషన్ డిస్‌ప్లే వ్యవస్థను కూడా భక్తుల కోసం ఏర్పాటు చేశారు. దేశ, విదేశాల నుంచి విమానాల్లో వచ్చే అయ్యప్ప భక్తులకు ఈ కేంద్రం ద్వారా ప్రయాణం మరింత సులభతరం కానుంది.

పోటీ కాదు, సహకారమే మన భవిష్యత్తు

మొదటిపేజీ తరువాయి - భవిష్యత్తును పోటీతో కాకుండా సహకారంతో తీర్చిదిద్దుకోవడం చాలా అవసరమన్నారు. రాబోయే సంవత్సరాల్లో 'వికసిత భారత్ 2047', 'ఆసియాన్ కమ్యూనిటీ విజన్ 2045' మన ఉమ్మడి ఆకాంక్షలను సాకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.గత కొన్నేళ్లుగా తమ 'యాక్ట్ ఈస్ట్' విధానం భారత్-ఆసియాన్ సంబంధాలకు కొత్త ఊపునిచ్చిందని మోదీ తెలిపారు. తమ భాగస్వామ్యం కేవలం సాంస్కృతిక వారసత్వానికే పరిమితం కాకుండా, డిజిటల్, రక్షణ, అంతరిక్షం వంటి కొత్త రంగాల్లోకి విస్తరిస్తోందని వివరించారు. 2014 నుంచి ప్రజా సంబంధాలను బలోపేతం చేసేందుకు 100కు పైగా కార్యక్రమాలు చేపట్టామని, 250 క్విక్ ఇంపాక్ట్ ప్రాజెక్టులు ప్రారంభించామని, 10,000కు పైగా స్కిల్ బిల్డింగ్ స్కాలర్‌షిప్‌లు అందించామని పేర్కొన్నారు.ప్రస్తుత ప్రపంచం అనేక సంక్షోభాలను ఎదుర్కొంటోందని, శాంతి, స్థిరత్వం గతంలో కంటే ఇప్పుడు ఎంతో అవసరమని మోదీ అన్నారు. ఈ నేపథ్యంలో 'మన భవిష్యత్తును కలిసి నిర్మించుకుందాం' అనే ఈ ఏడాది సదస్సు థీమ్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని చెప్పారు. ఈ సందర్భంగా, సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ రొమాల్డెజ్ మార్కోస్ జూనియర్‌కు మోదీ అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఎన్వోసీ కోరిన రేవంత్ రెడ్డి



మొదటిపేజీ తరువాయి - ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి ఎన్వోసీ కీలకంగా మారింది. ప్రాజెక్టులో నీటిని పూర్తి స్థాయిలో నిల్వ చేసినప్పుడు బ్యాక్ వాటర్ కారణంగా ఛత్తీస్ గఢ్ పరిధిలోని కొన్ని ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశాలున్నాయన్నది ఆ రాష్ట్ర అభ్యంతరం. గతంలోనూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిని కలిసి ప్రాజెక్టు వివరాలను వివరించి ఎన్వోసీ కోరారు.సమ్మక్క సాగర్ ప్రాజెక్టును మొదట కాంతనపల్లి వద్ద ప్రతిపాదించినప్పుడు ఆ ప్రాంతంలో 11,408 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. భద్రతా మౌలిక సదుపాయాలతో పాటు 17 ఆదివాసీ గ్రామాలపై ప్రభావం పడుతుందని గుర్తించడంతో ముంపును తగ్గించేందుకు బ్యారేజీ నిర్మాణ ప్రాంతాన్ని తుపాకులగూడెంకు మార్చారు. ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయనం ప్రకారం పూర్తి స్థాయి నీటి మట్టం వద్ద ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 33 ఎకరాలు ముంపునకు గురి కానుంది. భారీ వరదల సమయంలోనూ ప్రభావిత ప్రాంతం వంద ఎకరాలకు మించదు. ఐఐటీ ఖరగ్‌పూర్ తన నివేదికను జులై 30న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సమర్పించింది. అధ్యయనం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన రూ.9 కోట్ల 88లక్షలను తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్‌లోనే చెల్లించింది.ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం పూర్తయింది. పూర్తి స్థాయి నీటి మట్టం వద్ద దీని నిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలు. కరవు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు గోదావరి జలాలను వినియోగించాలనేది ఈ ప్రాజెక్టు లక్ష్యం. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను వినియోగించుకుని ఎస్సారెస్పీ రెండో దశ కింద సుమారు నాలుగు లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టును స్థిరీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రామప్ప-పాకాల లింక్ కెనాల్ ద్వారా మరో 30 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రణాళిక రూపొందించారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి ఎన్వోసీ పొందితే సమ్మక్క సాగర్ నుంచి అనేక ప్రయోజనాలు పొందవచ్చని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది.

మణుగూరులో వరుస ప్రకంపనలు

మొదటిపేజీ తరువాయి - వివరాల ప్రకారం.. మల్లేపల్లి ఓపెన్ కాస్ట్ గని సమీపంలో ఉదయం 11:28 గంటల సమయంలో మొదటిసారి ప్రకంపనలు వచ్చాయి. ఆ తర్వాత కొద్దిసేపటికే, అంటే 11:40 గంటల ప్రాంతంలో మరోసారి భూమి కంపించింది. మణుగూరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలైన రాజుపేట, విఠల్‌రావు నగర్, పీకే-1, బాపనకుంట, కొత్త కొండాపురంలలో ఈ ప్రకంపనల ప్రభావం స్పష్టంగా కనిపించింది. ముఖ్యంగా భూగర్భ గనులకు సమీపంలో ఉండే శివలింగపురంలో వరుసగా మూడుసార్లు భారీ శబ్దాలు వినిపించాయని, ఇళ్ల పైకప్పులు కూడా తీవ్రంగా కంపించాయని స్థానికులు చెబుతున్నారు.సాధారణంగా సింగరేణి కాలరీస్ పరిధిలోని ఓపెన్ కాస్ట్ గనుల్లో బ్లాస్టింగ్ ప్రక్రియ ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో జరుగుతుంటుంది. ఆ సమయంలో వచ్చే ప్రకంపనలు, శబ్దాలకు స్థానికులు అలవాటు



పడ్డారు. అయితే, మంగళవారం ఉదయం వేళల్లోనే ఈ భారీ శబ్దాలు రావడం, భూమి కంపించడంతో ఇది సింగరేణి బ్లాస్టింగా లేక సహజంగా సంభవించిన భూకంపమా అనే దానిపై ప్రజల్లో తీవ్ర అయోమయం నెలకొంది.ఈ ప్రకంపనల తీవ్రత, భూకంప కేంద్రానికి సంబంధించి అధికారిక సమాచారం ఇంకా వెలువడలేదు. మణుగూరు పరిసరాల్లో స్థానికంగా రిక్టర్ స్కేలు కొలిచే వ్యవస్థలు అందుబాటులో లేవు. మరోవైపు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ (ఎన్‌జీఆర్) అధికారిక పోర్టల్‌లో కూడా సాయంత్రం వరకు ఈ ప్రకంపనలకు సంబంధించిన డేటా నమోదు కాలేదు.భౌగోళికంగా గోదావరి లోయ పరివాహక ప్రాంతాల్లోని ప్రాచీన ఫాల్ట్ లైన్స్ కారణంగా అప్పుడప్పుడు స్వల్ప ప్రకంపనలు నమోదు కావడం సహజమేనని నిపుణులు చెబుతుంటారు. గతంలో 2026 జూన్ నెలలో కూడా మణుగూరు పరిసరాల్లో 3.8 తీవ్రతతో భూకంపం నమోదైంది. ప్రస్తుత ఘటనపై స్పష్టత కోసం స్థానిక ప్రజలు సింగరేణి యాజమాన్యంతో పాటు జిల్లా అధికార యంత్రాంగం, సిస్మాలజీ విభాగం నుంచి వచ్చే అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

హైదరాబాద్‌లో రోడ్ల పండుగ

మొదటిపేజీ తరువాయి - నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమానికి దేశ, విదేశాల నుంచి 3,000 మందికి పైగా రోడ్ ఇంజినీర్లు, అధికారులు, మౌలిక సదుపాయాల నిపుణులు హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ సదస్సును ప్రారంభించనుండగా, కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కూడా ప్రసంగిస్తారు.ఈ భారీ కార్యక్రమానికి ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సోమవారం తెలిపారు. హైటెక్స్‌లో జరిగే ఈ సదస్సులో భాగంగా దాదాపు 400 ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. "హైదరాబాద్‌కు వచ్చే అతిథులను ఎంతో ఆత్మీయంగా స్వాగతిస్తాం. ఈ సదస్సుకు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి గొప్ప అనుభూతిని పంచాలనుకుంటున్నాం. 'రైజింగ్ తెలంగాణ' కింద, బలమైన సాంస్కృతిక మూలాలున్న ఒక ఆధునిక రాష్ట్రం భవిష్యత్ రహదారులను ఎలా నిర్మిస్తోందో గర్వంగా ప్రపంచానికి చూపిస్తాం" అని మంత్రి కోమటిరెడ్డి వివరించారు.ఈ సదస్సులో భాగంగా ఏర్పాటు చేసే టెక్నికల్ ఎగ్జిబిషన్‌ను నవంబర్ 18న ప్రారంభించనున్నారు. రాష్ట్ర సాంస్కృతిక వారసత్వం, కీలకమైన మౌలిక సదుపాయాలు, రోడ్డు ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు ప్రత్యేకంగా 'రామప్ప టెంపుల్ పెవిలియన్' ఏర్పాటు చేయడం విశేషం. ప్రతినిధుల కోసం వసతి, రవాణా, ఆతిథ్యం విషయంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. వారికి హైదరాబాదీ వంటకాల రుచులను అందించడంతో పాటు, సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నారు. సదస్సు ముగిసిన తర్వాత నవంబర్ 22న ప్రతినిధుల కోసం ప్రత్యేక పర్యటనలు ఏర్పాటు చేశారు.1934లో ఏర్పాటైన ఇండియన్ రోడ్ కాంగ్రెస్,



దేశంలోని హైవే ఇంజినీర్ల అత్యున్నత సంస్థ. రోడ్లు, వంతెనల ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణకు సంబంధించిన ప్రమాణాలు, మార్గదర్శకాలను అభివృద్ధి చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

కెరీర్‌లో ఇది మంచి అవకాశం

మొదటిపేజీ తరువాయి - ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇటీవల ప్రకటించిన భారీ వాలంటరీ ఎగ్జిట్ (స్వచ్ఛంద నిష్క్రమణ) ప్యాకేజీల వెనుక ఉన్న అసలు కారణాలను సంస్థ సీఈవో సత్య నాదెళ్ల స్పష్టం చేశారు. ఓ పాడ్‌కాస్ట్‌లో ఆయన మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో వస్తున్న పెను మార్పుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఉద్యోగులు తమ కెరీర్‌పై పూర్తి నియంత్రణ కలిగి ఉండేందుకే ఈ ప్యాకేజీలను ఆఫర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.మైక్రోసాఫ్ట్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ వర్క్‌ఫోర్స్‌లో సుమారు 27 శాతం మందికి, అంటే దాదాపు 60 వేల మంది ఉద్యోగులకు ఈ స్వచ్ఛంద విరమణ ఆప్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. భారత్, అమెరికా, కెనడా, బ్రిటన్ దేశాల్లోని ఉద్యోగులకు ఈ ప్యాకేజీలను అందించారు. సాంకేతిక రంగంలో వస్తున్న వేగవంతమైన మార్పులకు అనుగుణంగా సంస్థను తీర్చిదిద్దే క్రమంలోనే ఈ నిర్ణయం అమల్లోకి వచ్చింది.ఈ అంశంపై సత్య నాదెళ్ల సుదీర్ఘంగా వివరణ ఇచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విస్తృతితో ఉద్యోగాలు చేసే విధానం, సంస్థలో అవసరమైన సిబ్బంది సంఖ్య పూర్తిగా మారుతున్నాయని ఆయన తెలిపారు. భవిష్యత్తులో కొత్త ఉద్యోగావకాశాలు వచ్చినప్పటికీ, వాటి స్వభావం ఇప్పటికంటే భిన్నంగా ఉంటుందని వివరించారు. మైక్రోసాఫ్ట్ లోపల అయినా, వెలుపల అయినా ఉద్యోగులు కొత్త నైపుణ్యాలను నేర్చుకుని ఎదిగేలా ప్రోత్సహించడమే కంపెనీ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.సంస్థలో ఎలాంటి మార్పు లేకుండా ఒకే స్థాయి లేదా ఒకే రోల్‌లో ఆగిపోయామని భావించే ఉద్యోగులకు స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అవకాశం కల్పించడానికే ఈ ఎగ్జిట్ ఆఫర్లను తెచ్చినట్లు సత్య నాదెళ్ల స్పష్టం చేశారు. సంస్థ వెలుపల తమ భవిష్యత్తును వెతుక్కోవాలనుకునే



వారికి ఈ ప్యాకేజీలు ఆర్థికంగా అండగా నిలుస్తాయని తెలిపారు. ఒక సాధారణ ఉద్యోగిగా కెరీర్ ప్రారంభించి సీఈవో స్థాయికి చేరిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ, ఎదుగుదల లేకుండా ఒకే పాత్రలో స్థిరపడిపోవడాన్ని తాను వ్యక్తిగతంగా కూడా ఇష్టపడనని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, సంస్థలోనే కొనసాగే ఉద్యోగులకు భవిష్యత్తులో మెరుగైన, సరికొత్త అవకాశాలను సృష్టించేందుకు కూడా ఈ ప్రక్రియ దోహదపడుతుందని కంపెనీ భావ

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
బుధవారం 18 - 11 - 2026

నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన ఏఆర్ డీఎస్పీ



బొమ్మనహాల్ (తెలుగు కలం) (నవంబర్ 17) : బొమ్మనహాల్ మండలంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఏఆర్ డీఎస్పీ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని అన్ని నామినేషన్ కేంద్రాలను సందర్శించిన ఆయన, అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు.?ఈ సందర్భంగా బొమ్మనహాల్ ఎస్సై నబి రసూల్ నామినేషన్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు, భద్రతా చర్యలు, శాంతిభద్రతల పరిస్థితులను డీఎస్పీకి వివరించారు. కేంద్రాల వద్ద సిబ్బంది మోహరింపును పరిశీలించిన డీఎస్పీ పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

పశుగ్రాసం కొరతతో వలస బాట పట్టిన పెనకచర్ల పశుపోషకులు



గార్లదిన్నె(తెలుగు కలం) (నవంబర్ 17) : ప్రతినిధి : ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా పశుగ్రాసం కొరత నెలకొనడంతో పశు పోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సింగనమల నియోజకవర్గం, గార్లదిన్నె మండలం, పెనకచర్ల గ్రామానికి చెందిన పశువుల కాపర్లు తమ పశువులకు మేత దొరకని పరిస్థితుల్లో సుమారు 400 ఆవులను తీసుకొని పొరుగున ఉన్న వైఎస్ఆర్ కడప జిల్లాకు వలస వెళ్లారు. స్థానికంగా పశుగ్రాసం లభ్యం కాకపోవడంతో మూగజీవాలను కాపాడుకునేందుకు ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితుల వల్ల అనంతపురం ప్రాంతంలో పశువులకు మేత కొరత తీవ్రమైంది. స్థానికంగా పశుగ్రాసం దొరకకపోవడంతో కొందరు రైతులు ఇతర ప్రాంతాల నుంచి అధిక ధరలకు సొప్పను కొనుగోలు చేసి తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, ఆర్థిక భారాన్ని భరించలేని పెనకచర్ల ప్రాంత పశువుల కాపర్లు, పశువుల ఆకలి తీర్చేందుకు వందలాది ఆవులతో కలిసి కాలినడకన కడప జిల్లా వైపు తరలివెళ్తున్న దృశ్యాలు స్థానిక రైతుల కష్టాలను కళ్లకు కడుతున్నాయి. ఈ వ్యవహారంపై విపక్షాలు మరియు రైతు సంఘాలు స్పందిస్తూ కూటమి ప్రభుత్వ పాలనపై విమర్శలు గుప్పిస్తున్నాయి. పశువులకు మేత, పశుపోషకులకు భరోసా కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తున్నాయి. తక్షణమే ప్రభుత్వం స్పందించి గోమాతలను కాపాడాలని, పశుపోషకులను ఆదుకునేందుకు సబ్సిడీపై లేదా ఉచితంగా పశుగ్రాసాన్ని అందించేలా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించడం మరియు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేయడం వంటి చర్యలు చేపడుతున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది.

అనంతపురంలో నవంబర్

19న జిల్లా స్థాయి యువజనోత్సవాలు



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 17) : జిల్లాలోని యువతీ యువకుల ప్రతిభను వెలికితీసేందుకు నవంబర్ 19వ తేదీన అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (అటానమస్) వేదికగా జిల్లా స్థాయి యువజనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆన్ సెట్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి మరియు జిల్లా యువజన సంక్షేమ అధికారి ఎన్. రవి శంకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ యువజన సర్వీసుల శాఖ డైరెక్టరు మరియు అనంతపురం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని 15 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులకు వివిధ సాంస్కృతిక మరియు సృజనాత్మక పోటీలను నిర్వహించనున్నారు. ప్రధానంగా జానపద నృత్యం (గ్రూప్), జానపద పాట (గ్రూప్), పెయింటింగ్, వీధి నాటకం (నుక్కడ్ నాటక్), మరియు కవితా రచన విభాగాలలో పోటీలు ఉంటాయని వివరించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి గెలుపొందిన విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని, రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనే అరుదైన అవకాశం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. కావున ఆసక్తి గల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీలలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. పోటీలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 9959517370 లేదా 9849913062 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

డిసెంబర్ 21న ఢిల్లీ జాతీయ సదస్సును విజయవంతం చేయాలని ఆర్ఎస్పీ రాష్ట్ర కన్వీనర్ సుబ్బరాయుడు పిలుపు



ధర్మవరం (తెలుగు కలం) (నవంబర్ 17) : ప్రతినిధి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను సమష్టిగా తిప్పికొట్టాలని, దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని ఆర్ఎస్పీ (రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ) రాష్ట్ర కన్వీనర్ సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. కడపలో ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఆర్ఎస్పీ రాష్ట్ర కమిటీ సమావేశంలో నాయకులు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా డిసెంబర్ 21న ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని నాయకులు అధికారికంగా విడుదల చేశారు. సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ, ప్రస్తుత ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఏ ఒక్క ఓటరుకు అన్యాయం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, పౌరుల ఓటు హక్కును కాపాడాలని డిమాండ్ చేశారు. నేడు దేశంలో కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు నిరుద్యోగం, విద్య, వైద్య రంగాల్లోని లోపాలు, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రజా సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. డిసెంబర్ 21న ఢిల్లీలో జరగబోయే జాతీయ సదస్సును పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, ప్రజాస్వామ్యవాదులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపి, నంద్యాల సుబ్బరాయుడు, బాలకృష్ణ, మంజుల, నరేంద్ర, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కలుషిత ఆహారం కారణంగా కేజీబీవీ విద్యార్థినులకు అస్వస్థత..

పరామర్శించిన కళ్యాణదుర్గం ఆర్డీవో



గుమ్మగట్ట నవంబర్ 17 తెలుగుకలం : అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలోని గుమ్మగట్ట మండలంలో ఉన్న కస్తూరీబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో మంగళవారం కలుషిత ఆహారం కారణంగా విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో ఆహారం తిన్న అనంతరం దాదాపు 40 మంది బాలికలకు వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది వెంటనే విద్యార్థినులను గుమ్మగట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పీహెచ్సీ) తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) హుటాహుటిన గుమ్మగట్ట పీహెచ్సీతో పాటు కేజీబీవీ పాఠశాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. అస్వస్థతకు గురైన 40 మంది బాలికలలో ప్రస్తుతం 10 మందికి గుమ్మగట్ట పీహెచ్సీలో ప్రత్యేక వైద్యం అందిస్తున్నామని, మిగతా వారితో సహా అందరి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందని వైద్యులు ఆర్డీవోకు వివరించారు. అనంతరం పాఠశాల పరిసరాలను, వంటగదిని పరిశీలించిన ఆర్డీవో విద్యార్థినుల అస్వస్థతకు గల కచ్చితమైన కారణాలపై పూర్తిస్థాయి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, వంటగది మరియు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

గుమ్మగట్ట కేజీబీవీలో కలుషిత ఆహారం కలకలం 56 మందికి అస్వస్థత

నిర్లక్ష్యపు సిబ్బందిని తక్షణమే సస్పెండ్ చేయాలి: ఏఐవైఎఫ్ (AIYF) డిమాండ్

వంటగదిలో పాడైపోయిన కూరగాయలు.. అధికారుల స్పందనపై ఆగ్రహం



గుమ్మగట్ట (తెలుగు కలం) (నవంబర్ 17) : గుమ్మగట్ట మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఆహార నాణ్యత లోపాల కారణంగా సుమారు 56 మంది విద్యార్థినులు కడుపునొప్పి, వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై ఏఐవైఎఫ్ అనంతపురం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కావలి కోట్రేష్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, విద్యార్థినుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న బాధ్యులైన సిబ్బందిని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.?ఈ ఘటనపై స్పందించిన ఆయన గుమ్మగట్ట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి పాఠశాలలో అందిస్తున్న రోజువారీ భోజనం, మెనూ, ఆహార నాణ్యత, ఇతర సమస్యలపై వివరాలు సేకరించారు. అనంతరం వైద్యాధికారులు, విద్యాశాఖ అధికారులతో కలిసి పాఠశాలలోని వంటగది, కూరగాయలు, గుడ్లు, పాలు, వంట సామగ్రి నిల్వ గదులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో పాడైపోయిన కూరగాయలు కనిపించడం ఆహార పదార్థాల నిల్వ, నాణ్యత విషయంలో పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనమని కోట్రేష్ విమర్శించారు. విద్యార్థినులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యతను పాఠశాల యాజమాన్యం విస్మరించడం వల్లే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గతంలో బొమ్మనహాల్ కేజీబీవీలోనూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పత్రికల్లో వచ్చినప్పటికీ అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. విద్యార్థినుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు జిసిడిఓ, ఏపీసీ అధికారులను సంప్రదించడానికి ప్రయత్నించినా స్పందన లేకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు.?గుమ్మగట్ట కేజీబీవీ ఘటనపై తక్షణమే సమగ్ర విచారణ జరపాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన బాధ్యులైన పాఠశాల సిబ్బందిని తక్షణమే సస్పెండ్ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. అలాగే విద్యార్థినులకు అందించిన ఆహారం, తాగునీటి నమూనాలను పరీక్షించి నాణ్యతను నిర్ధారించాలని, అస్వస్థతకు గురైన విద్యార్థినులందరికీ మెరుగైన వైద్య సేవలు అందించి పూర్తిగా కోలుకునే వరకు వైద్య పర్యవేక్షణ కొనసాగించాలని కోరారు. జిల్లాలోని అన్ని కేజీబీవీ పాఠశాలల్లో ఆహార నాణ్యత, పారిశుద్ధ్యం, విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.?విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యతని, పేద విద్యార్థినుల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఏఐవైఎఫ్ చూస్తూ ఊరుకోదని, విద్యార్థినులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని కావలి కోట్రేష్ హెచ్చరించారు.



బాల్య వివాహాల నిర్మూలన, చట్టబద్ధ దత్తతపై విద్యార్థులకు అవగాహన



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 17) : బాల్య వివాహాల నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణ మరియు చట్టబద్ధమైన దత్తత ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ అనంతపురంలోని ఎస్.వి. జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'బాల్య వివాహ ముక్త్ భారత్', 'అంతర్జాతీయ దత్తత అవగాహన మాసోత్సవం--2026' మరియు 'బాలల హక్కుల వారోత్సవాలను' పురస్కరించుకుని ఈ సదస్సును ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (DLSA) కార్యదర్శి శ్రీ రాజశేఖర్ మాట్లాడుతూ, 17 నుండి 18 సంవత్సరాల వయస్సు గల విద్యార్థినులు వ్యక్తిగత భద్రత, గుడ్ టచ్--బ్యాడ్ టచ్, పోక్సో చట్టం మరియు సైబర్ నేరాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాలలో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఉద్యోగాలు లేదా సినిమా అవకాశాల పేరుతో జరిగే మోసాలకు గురికావద్దని హెచ్చరించారు. వేధింపులు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, అధ్యాపకులు లేదా పోలీసులకు తెలియజేయాలని, మహిళలు మరియు పిల్లల కోసం డీఎల్ఎస్ఏ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీమతి ఎం. వెంకటేశ్వరి మాట్లాడుతూ, బాల్య వివాహ నిషేధ చట్టం--2006 ప్రకారం అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయడం నేరమని, ఇందుకు బాధ్యులైన వారికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తారని స్పష్టం చేశారు. చిన్న వయస్సులో వివాహాల వల్ల రక్తహీనత, మానసిక ఒత్తిడి వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, ప్రేమ పేరుతో జరిగే మోసాలను నిజ జీవిత ఉదాహరణలతో వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరితో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నవంబర్ అంతర్జాతీయ దత్తత అవగాహన మాసోత్సవం సందర్భంగా, అనాథ పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారు కేంద్ర దత్తత వనరుల సంస్థ అధికారిక వెబ్సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఆసుపత్రులు లేదా మధ్యవర్తుల ద్వారా నేరుగా పిల్లలను తీసుకోవడం మానవ అక్రమ రవాణా కిందకు వస్తుందని హెచ్చరించారు. దత్తత పిల్లలకు కూడా జీవసంతానంతో సమానమైన హక్కులు ఉంటాయని తెలిపారు. ఏపీ సెక్రటరీ చీఫ్ అడ్వైజర్ శ్రీ గోవిందరాజులు మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, విచక్షణా జ్ఞానాన్ని అలవర్చుకుని ఉన్నత లక్ష్యాల వైపు సాగాలని ఆకాంక్షించారు. బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా పిల్లలకు రాజ్యాంగం కల్పించిన జీవించే, రక్షణ పొందే, అభివృద్ధి చెందే మరియు భాగస్వామ్య హక్కుల గురించి వక్తలు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు చైల్డ్ హెల్ప్లైన్ (1098), మహిళా హెల్ప్లైన్ (181), పోలీస్ (100), సైబర్ క్రైమ్ (1930) మరియు అత్యవసర సేవల నంబర్ (112) లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమం ముగింపులో బాలల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలన, చట్టబద్ధ దత్తతపై రూపొందించిన అవగాహన పోస్టర్లను అతిథులు ఆవిష్కరించారు. బాలల పరిరక్షణ అనేది సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాలలపై ఎక్కడైనా వేధింపులు లేదా బాల్య వివాహాలు జరిగితే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సిబ్బంది ఖాజాముద్దీన్, చైల్డ్ హెల్ప్లైన్ ప్రతినిధి సురేష్ కుమార్, శిశు గృహం ప్రతినిధి శ్రీలక్ష్మి, డీసీపీయూ సిబ్బంది వెంకట్ కుమార్, వన్ స్టాప్ సెంటర్ ప్రతినిధి మంజుల, కౌన్సిలర్ సంధ్య, కళాశాల యాజమాన్య ప్రతినిధి ఖాజా వలి, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



కనేకల్లు సమగ్రాభివృద్ధి ఆనంద్‌తోనే సాధ్యం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

సేవా దృక్పథం ఉన్న ఆనంద్‌ను భారీ మెజారిటీతో గెలిపించండి

ఎమ్మెల్యే కాలవ పిలుపు



(తెలుగు కలం) (నవంబర్ 17) : కనేకల్లు గ్రామ సర్పంచ్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఉప్పర ఆనంద్ నామినేషన్ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొని ఓటర్లను ఉద్దేశించి ప్రసంగించారు. రాయదుర్గం మున్సిపాలిటీ తర్వాత నియోజకవర్గంలోనే అత్యధికంగా సుమారు 17 వేల మంది ఓటర్లు కలిగిన కనేకల్లు మండల కేంద్రానికి సమర్థుడైన నాయకుడు అవసరమని, అందుకే పార్టీలో సీనియర్ నాయకుడైన ఉప్పర ఆనంద్‌ను సర్పంచ్ బరిలో నిలిపామని తెలిపారు. గతంలో ఆనంద్ ఉపసర్పంచ్‌గా సేవలందించడంతో పాటు, ఆయన భార్య కూడా సర్పంచ్‌గా పనిచేశారని, ఆయనకు గ్రామంపై సంపూర్ణ అవగాహన ఉందని గుర్తుచేశారు. ప్రజా సమస్యలపై ఎప్పుడూ స్పందించే గుణం ఆనంద్ ప్రత్యేకత అని ఎమ్మెల్యే కొనియాడారు. కనేకల్లు నుంచి ఉరవకొండకు వెళ్లే మార్గంలో హగరి నది అడ్డుగా ఉండటంతో వర్షాకాలంలో రాకపోకలకు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, గతంలో ఆయన సొంత నిధులతో రోడ్ల మరమ్మతులు చేయించారని, ఆ సమస్యకు శాశ్వత పరిష్కారంగా తమ ప్రభుత్వం వంతెన నిర్మాణ పనులు చేపట్టిందని వివరించారు. రాజకీయ నాయకులు సాధారణంగా వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తుంటారని, కానీ ప్రజా సేవను నమ్ముకున్న ఆనంద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.?ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులున్నప్పటికీ కనేకల్లు రైతుల ప్రయోజనం కోసం హెచ్ఎల్సీ ద్వారా సాగునీటిని అందించామని, దీంతో రైతులు అధిక దిగుబడులతో పాటు మెరుగైన ధరలు పొందుతున్నారని తెలిపారు. కళ్లెదుటే సాగునీరు పారుతున్నా గతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేదని, దీనికి శాశ్వత పరిష్కారంగా జల్ జీవన్ మిషన్ కింద రెండు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభించి రాబోయే 30 ఏళ్ల పాటు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. 2014--19 మధ్య కాలంలోనే కాకుండా, ప్రస్తుతం రెండోసారి ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా కనేకల్లులో అద్భుతమైన రహదారులు, ఆసుపత్రి వంటి మౌలిక వసతులు కల్పిస్తూ గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. గ్రామం మరింత అభివృద్ధి చెందాలన్నా, శాంతి భద్రతలు మెరుగ్గా ఉండాలన్నా టీడీపీ అభ్యర్థి ఆనంద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు గుర్రప్ప, మండల పార్టీ అధ్యక్షుడు వన్నారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి, జెడ్పీటీసీ ఆదినారాయణ, కలెక్కుర్తి సుదర్శన్, రమేష్, షేక్ ముజ్జు, గౌస్ చాంద్, మరియప్ప, రైస్ మిల్ చంద్ర, మబు సాబ్, కురుబ నాగరాజు, తిప్పేస్వామి, విద్యానికేతన్ రవి తదితరులు పాల్గొన్నారు.



కస్తూరిబా విద్యార్థినుల అస్వస్థతపై సమగ్ర విచారణ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు..

బాధ్యులపై కఠిన చర్యలు: ఎమ్మెల్యే కాలవ

అస్వస్థతకు గురైన విద్యార్థినులకు

ఎమ్మెల్యే కాలవ పరామర్శ



(తెలుగు కలం) (నవంబర్ 17) : గుమ్మగట్ట కస్తూరిబా బాలికల పాఠశాల విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. గుమ్మగట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను మంగళవారం ఆయన పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై గుమ్మగట్ట మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థినుల ఆరోగ్య భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూస్తామన్నారు. సోమవారం సాయంత్రం ఆహారం తీసుకున్న అనంతరం 45 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. వారిలో ఆరుగురి ఆరోగ్య పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉండటంతో గుమ్మగట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్య చికిత్స అందించారన్నారు. మిగిలిన వారికి స్థానికంగానే వైద్య సేవలు అందిస్తున్నామని, ప్రస్తుతం విద్యార్థినులందరూ క్షేమంగా ఉన్నారని వెల్లడించారు. ఆరోగ్యకరమైన చక్కని వాతావరణంలో విద్యనభ్యసిస్తారనే నమ్మకంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలలో చేర్పిస్తున్నారని, అలాంటి చోట విద్యార్థినులు అస్వస్థతకు గురికావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇప్పటివరకు ఈ పాఠశాలలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోలేదని పేర్కొన్నారు. సోమవారం రాత్రి తయారు చేసిన సాంబారు, కూరల్లో ఉపయోగించిన పదార్థాల వల్ల విద్యార్థినులు అస్వస్థతకు గురై ఉండవచ్చని భావిస్తున్నామన్నారు. విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మిద్దింటి ధానవేంద్ర,ఎంపీటీసీ కాలువ సన్నన్న, మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి, మాజీ కన్వీనర్ కురుబ గిరిమల్లప్ప, సదాశివ,తదితరులు పాల్గొన్నారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

బుధవారం 18 - 11 - 2026

రైల్వే పోలీసుల ఉక్కుపాదం.. రూ.13.15 లక్షల చోరీ సొత్తు రికవరీ...!

రైళ్లలో ప్రయాణికులే టార్గెట్.. బ్యాగులు, బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్ల చోరీలకు పాల్పడుతున్న 19 ఏళ్ల యువకుడు అరెస్ట్



గుంతకల్లు నవంబర్ 17 తెలుగు కలం :- రైళ్లలో ప్రయాణికుల వస్తువులను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న యువకుడిని రైల్వే పోలీసులు, ఆర్పీఎఫ్ బృందం సంయుక్తంగా పట్టుకున్నారు. రెండు వేర్వేరు కేసులను ఛేదించి నిందితుడి నుంచి రూ.13.15 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్, హ్యాండ్ బ్యాగ్, అపాచీ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సమన్వయంతో పనిచేసిన ఇరు విభాగాల పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితుడి ఆట కట్టించారు.పోలీసుల వివరాల మేరకు.. గుంతకల్లు పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన వెంకటస్వామి కుమారుడు ముదిరిన ప్రసాంగి (19) అలియాస్ లక్కీ, వెంకీ ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. రాత్రి సమయాల్లో రైల్వే పార్కింగ్ ప్రాంతాలు, రైళ్లలో ప్రయాణికులు తమ సీట్ల వద్ద అజాగ్రత్తగా ఉంచిన బ్యాగులు, సెల్‌ఫోన్లను అపహరించేవాడని పోలీసులు తెలిపారు.

బంగారు ఆభరణాలు సహా రూ.12.45 లక్షల సొత్తు స్వాధీనం :-

అదోని రైల్వే పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 41/2026, సెక్షన్ 303(2) బీఎన్ఎస్ కేసులో నిందితుడి నుంచి పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. వీటిలో 17 గ్రాముల బంగారు డాలర్ చైన్, 25 గ్రాముల బంగారు గొలుసు, 2 గ్రాముల నెక్లెస్, 10 గ్రాముల చెవి దిద్దులు, 5 గ్రాముల ఉంగరం, మంగళసూత్రాలు, రెండు జతల బంగారు బిళ్లలు ఉన్నాయి. వీటితో పాటు లావీ కంపెనీ లేడీస్ హ్యాండ్ బ్యాగ్, రూ.15 వేల విలువైన మోటరోలా సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సొత్తు విలువ సుమారు రూ.12.45 లక్షలుగా అధికారులు వెల్లడించారు.

మరో కేసులో అపాచీ బైక్ రికవరీ :-

తాడిపత్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 267/2026, సెక్షన్ 303(2) బీఎన్ఎస్ కేసులో రూ.70 వేల విలువైన పసుపు రంగు అపాచీ ద్విచక్ర వాహనాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విధంగా రెండు కేసుల్లో కలిపి మొత్తం రూ.13.15 లక్షల విలువైన చోరీ సొత్తును రికవరీ చేశారు.

రైల్వే పోలీస్, ఆర్పీఎఫ్ బృందాల సమష్టి కృషి :-

ఈ కేసుల ఛేదనలో గుంతకల్లు రైల్వే డీఎస్ఆర్‌పీ పర్యవేక్షణలో రైల్వే సీఐ కె. అజయ్ కుమార్ ఆధ్వర్యంలోని బృందం కీలక పాత్ర పోషించింది. మరోవైపు ఆర్పీఎఫ్ సీఐ బి. కుమార్, ఎస్సై ఆనందప్ప నేతృత్వంలో సిబ్బంది ఆకాష్ కుమార్, సాయికిరణ్, రమేష్, మల్లేశ్వరయ్య, నాయక్ దర్యాప్తులో పాల్గొన్నారు.అలాగే ఏఎస్ఐ సి. శ్రీనివాసులు, ఆర్పీఏఎస్టీ కె.ఎం.వి. ప్రేమ్ కుమార్, ఆర్పీహెచ్‌సీ సి. శివరామయ్య, పీసీ జి. ప్రవీణ్, ఆర్పీసీ పి. హుస్సేన్ సాబ్, ఆర్పీసీ ఎస్.కె. మహమ్మద్ అలీ, ఆర్పీసీ సి. అమోస్ పాల్ తదితరులు ఈ ఆపరేషన్‌లో భాగస్వాములయ్యారు.

పోలీసు బృందానికి ఉన్నతాధికారుల అభినందనలు :-

రెండు కేసులను విజయవంతంగా ఛేదించి లక్షలాది రూపాయల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసు సిబ్బందిని గుంతకల్లు రైల్వే డీఎస్ఆర్‌పీ అభినందించారు. రైల్వే పరిధిలో ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ దొంగతనాల నివారణకు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికులు తమ విలువైన వస్తువులు, బ్యాగులు, సెల్‌ఫోన్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

పెనుగొండ డీవైఈఓ, తాడిమర్రి ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి

ఆర్ఎస్ఎఫ్ డిమాండ్



ధర్మవరం/కడప (తెలుగు కలం) (నవంబర్ 17) : ప్రతినిధి : కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) పాఠశాల కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ బాబు నాయక్‌కు ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకే హరికుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెనుగొండ డీవైఈఓపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శ్రీచైతన్య పాఠశాలకు ప్రీప్రైమరీ గుర్తింపు లేకుండానే అక్రమంగా నిర్వహిస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదులపై ఆర్జేడీ కార్యాలయం ఇప్పటికే రెండుసార్లు విచారణకు ఆదేశించినప్పటికీ, నేటికీ ఎలాంటి విచారణ జరగలేదని ఆయన తీవ్రంగా ఆరోపించారు. అదేవిధంగా, తాడిమర్రి ఎంఈఓ వారంలో కేవలం రెండు, మూడు రోజులు మాత్రమే కార్యాలయానికి హాజరవుతున్నారని, గత 15 ఏళ్లుగా అక్కడే పాతుకుపోయి విధులు నిర్వహిస్తున్నారని హరికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు తప్పనిసరిగా స్థానికంగానే నివసించాలనే ప్రభుత్వ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కోరారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న సంబంధిత అధికారులపై సమగ్ర విచారణ జరిపి, వారిపై తగిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆయన వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు.

తెలుగు ప్రాచీన, ఆధునిక కవులపై ప్రత్యేక సదస్సు



పెద్దవడుగూరు నవంబర్ 17 తెలుగుకలం : 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెద్దవడుగూరు శాఖా గ్రంథాలయంలో మంగళవారం తెలుగు ప్రాచీన, ఆధునిక కవుల సాహిత్య సేవలు మరియు వారి రచనా శైలిపై ఒక ప్రత్యేక సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కవుల గొప్పతనాన్ని, తెలుగు సాహిత్యానికి వారు అందించిన విశేష సేవలను వక్తలు సవివరంగా కొనియాడారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు జి. ఈశ్వరప్ప, గ్రామ పెద్దలు బి. నారాయణ, కె. చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు జి. ఈశ్వరప్ప మాట్లాడుతూ, తెలుగు సాహిత్య చరిత్రలో నన్నయ్య, తిక్కన, ఎర్రప్రగడ, పోతన వంటి ప్రాచీన కవులు విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. అలాగే ఆధునిక కవులలో గుర్రం జాషువా, శ్రీశ్రీ వంటి మహాకవులు తమదైన వినూత్న రచనా శైలితో తెలుగు సాహిత్యానికి విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. ప్రతి కవికి ప్రత్యేకమైన రచనా శైలి ఉంటుందని, నన్నయ్య, తిక్కన, ఎర్రప్రగడ త్రయం మహాభారతాన్ని తెలుగులోకి అనువదించి ఆంధ్ర మహాభారత ప్రచారానికి విశేష కృషి చేశారని వివరించారు. అదేవిధంగా బమ్మెర పోతన శ్రీమదాంధ్ర మహాభాగవతాన్ని అత్యంత భక్తిభావంతో రచించి తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. గ్రంథాలయాధికారి పి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులు తెలుగు సాహిత్యానికి ఎనలేని కీర్తిని తీసుకొచ్చారని అన్నారు. అల్లసాని పెద్దన, నంది తిమ్మన, ధూర్జటి, తెనాలి రామకృష్ణ, పింగళి సూరన వంటి మహనీయుల రచనలు తెలుగు సాహిత్యంలో ప్రత్యేక గుర్తింపు పొందాయని వివరించారు. నేటి యువత, విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని, తెలుగు కవిత్వం మరియు సాహిత్యంపై మక్కువ పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగు భాషా సాహిత్య వైభవాన్ని భావితరాలకు పరిచయం చేయడంలో గ్రంథాలయాల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పి. వెంకటేశ్వర్లుతో పాటు గ్రంథాలయ పాఠకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా శాంతిభద్రతలకు సహకరించాలి పోలీసుల విజ్ఞప్తి



గుత్తి (తెలుగు కలం) (నవంబర్ 17) : ప్రతినిధి : గుత్తి మండల పరిధిలోని గ్రామ పంచాయతీలకు సంబంధించి సర్పంచ్ మరియు వార్డు సభ్యుల ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఈ నెల 18వ తేదీ నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో, అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని గుత్తి పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 18, 19, 20 తేదీలలో ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని, అభ్యర్థులు నిర్దిష్ట సమయంలో సంబంధిత రిటర్నింగ్ అధికారికి నామినేషన్లు సమర్పించాలని సూచించారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థితో పాటు గరిష్టంగా మరో ఇద్దరు వ్యక్తులకు, అంటే మొత్తం ముగ్గురికి మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. ఒకవేళ అభ్యర్థి స్వయంగా హాజరుకాని పక్షంలో, ప్రతిపాదకుడితో పాటు మరో ఇద్దరు వ్యక్తులకు మాత్రమే అనుమతి ఇస్తామని తెలిపారు. నామినేషన్ కార్యాలయానికి 100 మీటర్ల అవతల వాహనాలను నిలిపి రావాలని, అభ్యర్థులు తమ అనుచరులతో ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడం, గుంపులుగా చేరడం, నినాదాలు చేస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించడం వంటివి పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎటువంటి వాగ్వాదాలు, ఘర్షణలు, బెదిరింపులు, పరస్పర దూషణలకు పాల్పడరాదని, ఇతర అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియకు ఎటువంటి ఆటంకం కలిగించరాదని స్పష్టం చేశారు. అలాగే, ఎవరూ మారణాయుధాలు, ప్రమాదకర వస్తువులు వెంట తీసుకురాకూడదని, మద్యం సేవించి నామినేషన్ కేంద్రాల వద్దకు రావడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడడం నిషేధమని హెచ్చరించారు. ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు, వదంతులను నమ్మరాదని, వాటిని ఇతరులకు పంపరాదని సూచించారు. ఏదైనా సమస్య లేదా అవాంఛనీయ సంఘటన జరిగినట్లయితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. గుత్తి మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు అభ్యర్థులు, ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని, ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని గుత్తి పోలీసులు స్పష్టం చేశారు.

అక్వాన్ తుఫాను ముప్పు జిల్లా యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం



అనకాపల్లి (తెలుగు కలం) (నవంబర్ 17) : ప్రతినిధి : బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తుఫాను జిల్లాపై ప్రభావం చూపే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్, పోలీసు, రోడ్లు-భవనాలు, అగ్నిమాపక మరియు వైద్యారోగ్య శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. సమాచార మార్పిడి విషయంలో కేవలం వాట్సాప్ సందేశాలపైనే ఆధారపడకుండా, మండల స్థాయి అధికారులు నేరుగా ఫోన్ ద్వారా మాట్లాడుకుంటూ ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా తుఫానుకు ముందు, ఆ తర్వాత గర్భిణీ స్త్రీలను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాత్రి వేళల్లో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఎక్కడా అంతరాయం కలగకుండా చూడాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పంపులు, జనరేటర్లు, జేసీబీలను కనీసం ఐదు రోజుల పాటు సిద్ధంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. మండల ప్రత్యేక అధికారులు వర్షపాతాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ మాట్లాడుతూ, కంట్రోల్ రూమ్ సమన్వయంతో 104, 108, 102 వైద్య సేవలతో పాటు పశుసంవర్ధక శాఖ అంబులెన్స్ సర్వీసులు 24 గంటలూ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ప్రతి శాఖ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, సంబంధిత అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లను డీఆర్ఓ ఆధ్వర్యంలోని కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌కు తప్పనిసరిగా అందజేయాలన్నారు. ఏదైనా ప్రాణనష్టం జరిగితే తక్షణమే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని ఆదేశించారు. గతంలో నీటిపారుదల, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం వల్ల రాత్రి వేళల్లో తలెత్తిన ఇబ్బందులు పునరావృతం కాకూడదని హెచ్చరించారు. మత్స్యశాఖ అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించి, వేటకు వెళ్లిన మత్స్యకారులందరినీ సురక్షితంగా తీరానికి రప్పించడంతో పాటు బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు క్షేత్రస్థాయిలోనే అందుబాటులో ఉండి ప్రజలకు భరోసా కల్పించాలని సూచించారు. ఈ సమీక్షలో డీఆర్ఓ వై. సత్యనారాయణ రావుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కసాపురం ఆంజనేయ స్వామి సేవలో

సత్యసాయి జిల్లా కలెక్టర్‌కామ్ ప్రసాద్

గుంతకల్లు నవంబర్ 17 తెలుగు కలం





ప్రముఖ పుణ్యక్షేత్రమైన అనంతపురం జిల్లా కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి వారిని సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఐఏఎస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన కలెక్టర్, కుటుంబ సభ్యులకు దేవస్థానం ఈఓ మేడేపల్లి విజయరాజు, ప్రధాన అర్చకులు కే. రాఘవాచార్యులు, వేద పండితులు, అర్చకులు పూర్ణకుంభంతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం యాగశాలలో వేద పండితుల ఆశీర్వచనం పొందారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్న కలెక్టర్ కుటుంబ సభ్యులు ఆలయ ఆధ్యాత్మిక వాతావరణంలో కొంతసేపు గడిపారు.

తమ్ముడిని కాపాడి.. ప్రాణాలు విడిచిన అన్న



టెక్కలి (తెలుగు కలం) (నవంబర్ 17) : ప్రతినిధి : తమ్ముడిని ప్రాణాపాయం నుంచి కాపాడిన ఓ అన్నయ్య, విధి వక్రీకరించడంతో తాను మాత్రం మృత్యుఒడికి చేరుకున్న హృదయవిదారక ఘటన శ్రీకాకుళం జిల్లా టెక్కలి రూరల్ మేజర్ పంచాయతీ పరిధిలోని గోపినాథపురంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, మందస మండలం మకరజోల గ్రామానికి చెందిన గూన ధనుష్ (21) ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఇతను తన తమ్ముడు కుమార్‌తో కలిసి గోపినాథపురంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో ఇద్దరూ కలిసి స్నానం చేసేందుకు సమీపంలోని చెరువు వద్దకు వెళ్లారు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు తమ్ముడు కుమార్ నీటిలో మునిగిపోయాడు. దీనిని గమనించిన అన్న ధనుష్ ఏమాత్రం ఆలోచించకుండా తమ్ముడిని కాపాడేందుకు చెరువులోకి దూకాడు. తీవ్రంగా శ్రమించి తమ్ముడు కుమార్‌ను సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన ధనుష్, ప్రమాదవశాత్తు కాలు జారి లోతైన నీటిలో పడిపోయి మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రులు నారాయణరావు, అప్పలకొండ చేతికి అందివచ్చిన కుమారుడు ఇలా అకాల మరణం చెందడంతో గుండెలు అవిసేలా కన్నీరుమున్నీరవుతున్నారు. తమ్ముడి కోసం ప్రాణాలర్పించిన ధనుష్ మరణంతో అటు మకరజోల, ఇటు గోపినాథపురం గ్రామాల్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆక్వాన్ తుపాను నేపథ్యంలో

చేబ్రోలులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ సూచన



చేబ్రోలు (తెలుగు కలం) (నవంబర్ 17) : ప్రతినిధి : రాబోవు ఆక్వాన్ తుపాను తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గుంటూరు జిల్లా చేబ్రోలు తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహశీల్దారు కె.శ్రీనివాస శర్మ మంగళవారం తెలిపారు. తుపాను ఉధృతి నేపథ్యంలో గుంటూరు జిల్లా కలెక్టర్ సి.ఎం.సాయికాంత్ వర్మ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, మండల మరియు గ్రామ స్థాయిలో తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. రాబోవు మూడు రోజుల పాటు తీవ్రమైన గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, రైతులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని కోరారు. తుపాను ప్రభావం ఎక్కువగా ఉండే సూచనలు ఉన్నందున ప్రజలు అత్యవసరమైతేనే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, దూర ప్రయాణాలను పూర్తిగా మానుకోవాలని తహశీల్దార్ సూచించారు. ముందస్తు జాగ్రత్తగా నిత్యావసర సరుకులను ఇళ్లలో సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. అలాగే, భారీ వర్షాల వల్ల పంటలకు జరిగే నష్టతీవ్రతను తగ్గించుకునేందుకు రైతులు తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కోరారు. ప్రజలకు తక్షణ సహాయ సహకారాలు అందించేందుకు కంట్రోల్ రూమ్ ఇన్చార్జిగా మండల రెవెన్యూ అధికారి పి.శ్రీనివాసరావును నియమించామని, అవసరమైన వారు 8500513573 నంబరులో సంప్రదించవచ్చని తహశీల్దారు వివరించారు.

మాదకద్రవ్యాల కేసుల్లో నిందితుడికి

పిట్ ఎన్‌డిపిఎస్ చట్టం కింద జైలు శిక్ష

విశాఖ సెంట్రల్ జైలుకు తరలింపు



నక్కపల్లి (తెలుగు కలం) (నవంబర్ 17) : ప్రతినిధి : మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరియు విక్రయ కేసుల్లో నిందితుడిగా ఉన్న ఒక వ్యక్తిని విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించినట్లు నక్కపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సిఐ) జె. మురళి ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి జిల్లా, రావికమతం మండలం, కొత్తకోట గ్రామానికి చెందిన అడ్డూరి ప్రసాద్ గతంలో మూడు వేర్వేరు ఎన్‌డిపిఎస్ కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడు. అతడు తరచూ ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతుండటంతో, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో, పిట్ ఎన్‌డిపిఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ జారీ చేసిన ప్రత్యేక ఆదేశాల మేరకు, మంగళవారం నాడు నిందితుడు అడ్డూరి ప్రసాద్‌ను అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎదుట హాజరుపరిచారు. నిందితుడి నేర చరిత్ర మరియు ఉన్నతాధికారుల ఆదేశాలను పరిశీలించిన అనంతరం, జిల్లా ఎస్పీ అతడిని ముందస్తు నిర్బంధంలో భాగంగా జైలుకు తరలించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ ఆదేశాల ప్రకారం, పోలీసు బందోబస్తు నడుమ నిందితుడు అడ్డూరి ప్రసాద్‌ను విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించి అక్కడి అధికారులకు అప్పగించినట్లు సిఐ జె. మురళి వెల్లడించారు. మాదకద్రవ్యాల రవాణాలో పదేపదే పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

బెనేకల్ సర్పంచ్ అభ్యర్థిగా కోరి ఎర్రిస్వామి నామినేషన్ దాఖలు



(తెలుగు కలం) (నవంబర్ 17) : కనేకల్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కనేకల్ మండలం బెనేకల్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి, ఆ పార్టీ సీనియర్ నాయకుడు కోరి ఎర్రిస్వామి నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానుల సమక్షంలో ఆయన తన నామినేషన్ పత్రాలను సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందజేశారు.?నామినేషన్ దాఖలు అనంతరం కోరి ఎర్రిస్వామి మీడియాతో మాట్లాడుతూ తన ఎన్నికల ప్రాధాన్యతలను వివరించారు. బెనేకల్ గ్రామ పంచాయతీ పరిధిలో దీర్ఘకాలంగా నెలకొన్న మౌలిక వసతులు మరియు ఇతర ప్రజా సమస్యలను పరిష్కరించడానికి తాను కృషి చేస్తానని తెలిపారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. పంచాయతీ ప్రజలందరూ తనను ఆశీర్వదించి, అత్యధిక మెజారిటీతో గెలిపించడం ద్వారా గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. తనపై పూర్తి నమ్మకం ఉంచి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించిన నియోజకవర్గ ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు గారికి కోరి ఎర్రిస్వామి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే, నామినేషన్ ప్రక్రియలో తన వెంట ఉండి సంపూర్ణ మద్దతు తెలిపిన మండల, గ్రామ స్థాయి టిడిపి నాయకులకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి బంపర్ ఆఫర్

ఏకగ్రీవం చేస్తే 2 ఎకరాల భూమి!



(తెలుగు కలం) (నవంబర్ 17) : రౌతులపూడి : కాకినాడ జిల్లా రౌతులపూడి గ్రామ పంచాయతీ పాలకవర్గానికి చింతకాయల వెంకట సుబ్బలక్ష్మిని గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకుంటే, పంచాయతీ అవసరాల కోసం రెండు ఎకరాల భూమిని విరాళంగా అందిస్తామని ఆమె, ఆమె భర్త శోభన్ బాబు కృష్ణ ప్రకటించారు. మంగళవారం రౌతులపూడిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా దంపతులు మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి అనేది కేవలం ఒక్కరి బాధ్యత మాత్రమే కాదని, గ్రామ ప్రజలందరి సమిష్టి భాగస్వామ్యంతోనే రౌతులపూడిని ఆదర్శవంతమైన పంచాయతీగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడం, ప్రజలకు నిరంతరాయంగా తాగునీటి సౌకర్యం కల్పించడం, అలాగే మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యాలని వారు స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీకి అవసరమైన ఆస్తులు, వనరులు సమకూరినప్పుడే ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. గ్రామ అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందించాలనే సదుద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. చింతకాయల వెంకట సుబ్బలక్ష్మిని గ్రామ పంచాయతీ పాలకవర్గానికి ఏకగ్రీవంగా ఎన్నుకున్న పక్షంలో, వెంటనే రెండు ఎకరాల భూమిని పంచాయతీ పేరిట విరాళంగా అందజేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వారు మరోసారి స్పష్టం చేశారు.

కనేకల్ వైసిపి సర్పంచ్ అభ్యర్థిగా

అన్వర్ సాధాత్ నామినేషన్ దాఖలు



కనేకల్:(తెలుగు కలం) (నవంబర్ 17): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కనేకల్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి వైసిపి పార్టీ బలపరిచిన అభ్యర్థి, ఆ పార్టీ సీనియర్ నాయకుడు అన్వర్ సాధాత్ నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానుల సమక్షంలో ఆయన తన నామినేషన్ పత్రాలను సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందజేశారు.?నామినేషన్ దాఖలు అనంతరం అన్వర్ సాధాత్ మీడియాతో మాట్లాడుతూ తన ఎన్నికల ప్రాధాన్యతలను వివరించారు. కనేకల్ గ్రామ పంచాయతీ పరిధిలో దీర్ఘకాలంగా నెలకొన్న మౌలిక వసతులు మరియు ఇతర ప్రజా సమస్యలను పరిష్కరించడానికి తాను కృషి చేస్తానని తెలిపారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. పంచాయతీ ప్రజలందరూ తనను ఆశీర్వదించి, అత్యధిక మెజారిటీతో గెలిపించడం ద్వారా గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. తనపై పూర్తి నమ్మకం ఉంచి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించిన నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవింద్ రెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే, నామినేషన్ ప్రక్రియలో తన వెంట ఉండి సంపూర్ణ మద్దతు తెలిపిన మండల, గ్రామ స్థాయి వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్పర్సన్ ఉషారాణి, మాజీ పట్టణ కన్వీనర్ కేశవరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ నభిసాబ్,సీనియర్ నాయకుడు చంద్రశేఖర్ పలువురు స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తి డివిజన్ వ్యవసాయ సిబ్బందికి

ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమం





గుత్తి (తెలుగు కలం) (నవంబర్ 17) : ప్రతినిధి : అనంతపురం జిల్లా గుత్తి డివిజన్ పరిధిలోని వ్యవసాయ శాఖ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణలో భాగంగా, మంగళవారం గుత్తిలోని సీఎల్ఆర్సీ భవనంలో ఫిజియోథెరపీకి సంబంధించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విధి నిర్వహణలో భాగంగా నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించడం, ఎక్కువ సమయం ప్రయాణించడం మరియు కార్యాలయ పనుల వల్ల వ్యవసాయ సిబ్బంది ఎదుర్కొంటున్న వెన్ననొప్పి, మెడనొప్పి, కీళ్ల నొప్పులు వంటి శారీరక సమస్యల నివారణే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ ఫిజియోథెరపిస్టులు డాక్టర్ రమేష్ మరియు సురేష్ కుమార్ రెడ్డి సిబ్బందికి పలు కీలక ఆరోగ్య సూచనలు చేశారు. విధులు నిర్వర్తించే సమయంలో మరియు ప్రయాణించేటప్పుడు సరైన శారీరక భంగిమను పాటించడం ద్వారా కండరాల ఒత్తిడిని తగ్గించుకోవచ్చని వారు వివరించారు. పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రతిరోజూ కనీసం 20 నుండి 30 నిమిషాల పాటు తేలికపాటి స్ట్రెచింగ్ మరియు వ్యాయామాలు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రత్యక్షంగా చేసి చూపించారు. అంతేకాకుండా, నొప్పులు తీవ్రం కాకముందే ప్రారంభ దశలోనే ఫిజియోథెరపీ చికిత్స తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక సమస్యలను సులభంగా నివారించవచ్చని సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ, సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే రైతులకు మరింత మెరుగైన సేవలు అందించగలరని, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు సిబ్బందికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి డివిజన్ వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈఓలు మరియు ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని నిపుణులతో తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి సీనియర్ టీడీపీ

నాయకుడు కురుబ ముదెప్ప గారి ఉమేష్ చేరిక



కళ్యాణదుర్గం (తెలుగు కలం) (నవంబర్ 17) : ప్రతినిధి : కళ్యాణదుర్గం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మండలంలోని బోరంపల్లి గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు కురుబ ముదెప్ప గారి ఉమేష్ మంగళవారం ఆ పార్టీకి రాజీనామా చేసి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ?ఈ సందర్భంగా పార్టీలో చేరిన ఉమేష్‌కు సమన్వయకర్త రంగయ్య సాదరంగా స్వాగతం పలికి, పార్టీ కండువా కప్పి అభినందించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, సముచిత గౌరవం లభిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. అనంతరం ఉమేష్, స్థానిక నేతలతో కలిసి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ?ఈ కార్యక్రమంలో బోరంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ ఎంపీటీసీ బలరాం, కృష్ణారెడ్డి, గూనిపల్లి కిష్టయ్య, పాల్ సంజీవరెడ్డి, ఉల్లి చెన్నప్ప గారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చీటీల పద్ధతిలో సర్పంచ్ ఏకగ్రీవం.. రూ. 25.6 లక్షలు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన అభ్యర్థి

బెళుగుప్ప (తెలుగు కలం) (నవంబర్ 17) : ప్రతినిధి : పంచాయతీ ఎన్నికల వేళ అనంతపురం జిల్లా బెళుగుప్ప మండలంలోని నక్కలపల్లి గ్రామం మరోసారి వార్తల్లో నిలిచింది. ఎన్నికల సమయంలో జరిగే అనవసర ఖర్చులు, రాజకీయ విభేదాలు, గొడవలకు తావులేకుండా ఉండటంతో పాటు గ్రామాభివృద్ధికి నిధులు సమకూర్చుకోవాలనే ఉద్దేశంతో గ్రామస్థులు తమ పాత సంప్రదాయాన్నే కొనసాగిస్తూ సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసుకున్నారు. నక్కలపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం ఈసారి జనరల్ మహిళకు రిజర్వ్ అయింది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి గ్రామ పెద్దలు, గ్రామస్థులు కలిసి సమావేశం నిర్వహించారు. గ్రామాభివృద్ధికి ఎవరు అత్యధికంగా నిధులు అందిస్తారో వారికే సర్పంచ్ పదవిని ఏకగ్రీవంగా కట్టబెట్టాలని నిర్ణయించారు. ఈ పదవి కోసం పోటీ పడాలనుకున్న 9 మంది ఆశావహులను పిలిపించి, తాము గ్రామానికి ఎంత మొత్తం విరాళంగా ఇవ్వగలమో చీటీలపై రాసి ఒక డబ్బాలో వేయాలని



సూచించారు. అనంతరం గ్రామస్థులందరి సమక్షంలో ఆ డబ్బాలోని చీటీలను తీసి పరిశీలించారు. అందులో సుదర్శనరెడ్డి అనే వ్యక్తి తన భార్య అఖిల పేరుతో గ్రామాభివృద్ధి కోసం అత్యధికంగా రూ. 25.6 లక్షలు ఇస్తానని చీటీలో రాశారు. మిగతా అభ్యర్థులందరి కంటే ఎక్కువ మొత్తాన్ని ప్రకటించడంతో గ్రామస్థులంతా ఏకగ్రీవంగా అఖిలను సర్పంచ్ అభ్యర్థిగా ఎంపిక చేస్తూ ఆమోదం తెలిపారు. ?నక్కలపల్లి గ్రామంలో ఈ తరహా ఏకగ్రీవ ప్రక్రియ జరగడం ఇది మొదటిసారేమీ కాదు. గత పంచాయతీ ఎన్నికల సమయంలో కూడా గ్రామస్థులు ఇదే చీటీల పద్ధతిని అనుసరించారు. అప్పట్లో రామిరెడ్డి అనే వ్యక్తి గ్రామాభివృద్ధికి రూ. 21 లక్షలు అందించేందుకు ముందుకు వచ్చి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఏకంగా రూ. 4.6 లక్షలు అధికంగా రూ. 25.6 లక్షలు పలకడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, గ్రామాభివృద్ధి పేరుతో జరిగే ఇటువంటి ఏకగ్రీవాలపై ఎన్నికల సంఘం నిబంధనలు, అధికారిక నామినేషన్ల ప్రక్రియ ఎలా సాగుతుందనే దానిపై ఆసక్తి నెలకొంది.

43 ఉడేగోళం టిడిపి సర్పంచ్ అభ్యర్థిగా పివి మారుతి ప్రసాద్ లావణ్య నామినేషన్ దాఖలు

కనేకల్: (తెలుగు కలం) (నవంబర్ 17) : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కనేకల్ మండలం 43 ఉడేగోళం గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి టిడిపి పార్టీ బలపరిచిన అభ్యర్థి, ఆ పార్టీ సీనియర్ నాయకుడు మారుతి ప్రసాద్ భార్య లావణ్య నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానుల సమక్షంలో ఆమె తన నామినేషన్ పత్రాలను సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందజేశారు.?నామినేషన్ దాఖలు అనంతరం లావణ్య మీడియాతో మాట్లాడుతూ తన ఎన్నికల ప్రాధాన్యతలను వివరించారు. సర్పంచ్ గా తనకు మరొక అవకాశం కల్పించాలని ఊడే గోళం గ్రామ పంచాయతీ పరిధిలో దీర్ఘకాలంగా నెలకొన్న మౌలిక వసతులు మరియు ఇతర ప్రజా సమస్యలను పరిష్కరించడానికి తాను కృషి చేస్తానని తెలిపారు. వైసిపి హయాంలో



సర్పంచిగా తాను గెలిచినప్పటికీ నిధులు రాక గ్రామంలో సరైన అభివృద్ధి జరగలేదన్నారు. తమ వంతు కృషిచేసి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి నిధులు వస్తాయని గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే తన ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. పంచాయతీ ప్రజలందరూ తనను ఆశీర్వదించి, అత్యధిక మెజారిటీతో గెలిపించడం ద్వారా గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ఆమె కోరారు. తనపై పూర్తి నమ్మకం ఉంచి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించిన నియోజకవర్గ ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులకు దంపతులు ఇద్దరు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే, నామినేషన్ ప్రక్రియలో తన వెంట ఉండి సంపూర్ణ మద్దతు తెలిపిన మండల, గ్రామ స్థాయి టిడిపి నాయకులకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్లకు

భారీ భద్రత శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ



పుట్టపర్తి (తెలుగు కలం) (నవంబర్ 17) : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లాలో రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు పటిష్ఠమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ సతీశ్ కుమార్ వెల్లడించారు. జిల్లాలోని కదిరి, పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న 12 మండలాల్లో ఈ రెండో దశ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఈ నెల 18వ తేదీ నుండి 20వ తేదీ వరకు అభ్యర్థుల నుండి నామినేషన్లను స్వీకరించనున్నట్లు ఎస్పీ తెలిపారు. అనంతరం ఈ నెల 29వ తేదీన పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఓట్ల లెక్కింపు ప్రక్రియను కూడా పూర్తి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని ఎస్పీ స్పష్టం చేశారు. ముఖ్యంగా నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు మరియు అభ్యర్థులు పోలీసు శాఖకు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్పీ సతీశ్ కుమార్ కోరారు.

నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ, సీఐ





యాడికి నవంబర్ 17 (తెలుగుకలం): యాడికి మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు డిసెంబర్ 2న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వీరరాజు తెలిపారు.నామినేషన్ల స్వీకరణకు ఐదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.చందన సచివాలయంలో చందన, లక్ష్మంపల్లి,కమలపాడు పంచాయతీలో కమలపాడు, నిట్టూరు, గుడిపాడు,యాడికి పంచాయతీ కార్యాలయంలో యాడికి, కొనుప్పలపాడు, చికేపల్లి,వేములపాడు పంచాయతీ కార్యాల యంలో వేములపాడు,నగరూరు,వెంకన్నపల్లి రాయలచెరు వు-2 సచివాలయంలో రాయలచెరువు, తూట్రాలపల్లి,పుప్పా ల గ్రామాలకు సంబంధించిన నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో మంగళవారం తాడిపత్రి డీఎస్పీ చంద్రశేఖర్, యాడికి సీఐ శ్రీనివాసులు ఆయా నామినేషన్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు భద్రతపై సమీక్షించారు.

నామినేషన్ కేంద్రాలపై ఏఎస్పీ అంకిత పర్యవేక్షణ



ధర్మవరం (తెలుగు కలం) (నవంబర్ 17 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను జిల్లా అడిషనల్ ఎస్పీ అంకిత సురాణ మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ధర్మవరం డివిజన్‌లో నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో, భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేసేందుకు ఆమె ముదిగుబ్బ మరియు బత్తలపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆయా మండలాల్లోని పలు నామినేషన్ కేంద్రాలను నేరుగా సందర్శించిన ఏఎస్పీ , అక్కడ నెలకొన్న శాంతిభద్రతల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అధికారులు, పోలీసు సిబ్బంది తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసు అధికారులతో మాట్లాడిన ఆమె, గత రెండు రోజులుగా నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు గానీ, గొడవలు గానీ జరగకుండా నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగిందని అభినందించారు. అదే స్ఫూర్తితో అత్యంత కీలకమైన చివరి రోజు ప్రక్రియను కూడా ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, సజావుగా మరియు ప్రశాంత వాతావరణంలో ముగించాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కేంద్రాల వద్ద రద్దీ నియంత్రణతో పాటు, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆమె పోలీసులకు సూచించారు.

శ్రీ సత్యసాయి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

కారు బోల్తా పడి ఆరుగురికి గాయాలు



సోమందేపల్లి (తెలుగు కలం) (నవంబర్ 17 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సోమందేపల్లి మండలం పాపిరెడ్డిపల్లి సమీపంలో కర్నూలు నుంచి పాలసముద్రం వైపు ప్రయాణిస్తున్న ఒక కారు అకస్మాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాద సమయంలో కారులో ఒక బాలుడు, వృద్ధ మహిళతో సహా మొత్తం ఆరుగురు ప్రయాణిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే పెద్ద శబ్దం రావడంతో అక్కడే ఉన్న స్థానికులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారులో చిక్కుకున్న క్షతగాత్రులను స్థానికులు చాకచక్యంగా బయటకు తీసి, వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది గాయపడిన వారందరినీ చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, సమయానికి స్థానికులు స్పందించి ఆసుపత్రికి తరలించడంతో ప్రయాణికులందరికీ ప్రాణాపాయ పరిస్థితి తప్పింది. వైద్యులు క్షతగాత్రులకు తక్షణ వైద్య సేవలు అందిస్తుండటంతో కుటుంబ సభ్యులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

సర్పంచ్ పదవికి టెండర్ తరహా ఎంపిక

నక్కలపల్లిలో రూ.25.60 లక్షల బిడ్!

నక్కలపల్లి పంచాయతీలో వినూత్నంగా సర్పంచ్ ఎంపిక

పోటీలో నిలిచిన 9 మంది అభ్యర్థులు

చీటీలో అత్యధికంగా రూ.25.60 లక్షలు రాసిన సుదర్శన్ రెడ్డి

భార్య అఖిలను సర్పంచ్‌గా ఖరారు చేసిన గ్రామస్తులు

ఈ విధానానికి చట్టబద్ధత లేదని స్పష్టీకరణ



అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలంలోని నక్కలపల్లి గ్రామంలో సర్పంచ్ పదవి ఎంపిక కోసం స్థానికులు అనుసరించిన తీరు చర్చనీయాంశంగా మారింది. గ్రామాభివృద్ధికి ఎవరు ఎక్కువ నిధులు ఇస్తారనే అంశంపై చీటీల ద్వారా సర్పంచ్ అభ్యర్థిని ఖరారు చేయడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నక్కలపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం ఈసారి మహిళకు రిజర్వ్ అయింది. దీంతో గ్రామానికి చెందిన పలువురు ఈ పదవిని ఆశించారు. అయితే ఎన్నికల్లో భారీగా ఖర్చు చేసే బదులు, ఆ మొత్తాన్ని గ్రామాభివృద్ధికి ఇస్తే బాగుంటుందనే ప్రతిపాదన గ్రామస్తుల మధ్య వచ్చింది. ఈ క్రమంలో సర్పంచ్ పదవి కోసం పోటీపడే అభ్యర్థులు గ్రామాభివృద్ధి కోసం ఎంత మొత్తం ఖర్చు చేయగలరో చీటీలపై రాసి డబ్బాలో వేయాలని నిర్ణయించారు. మొత్తం 9 మంది అభ్యర్థులు ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. అందరూ వేసిన చీటీలను గ్రామస్తుల సమక్షంలో తెరిచి చూడగా, స్థానిక నాయకుడు సుదర్శన్ రెడ్డి తన భార్య అఖిల పేరుతో అత్యధికంగా రూ.25.60 లక్షలు ఇస్తామని రాశారు. మిగిలిన వారందరి కంటే ఈ మొత్తమే ఎక్కువగా ఉండటంతో, గ్రామస్తులంతా ఏకతాటిపైకి వచ్చి అఖిలను సర్పంచ్‌గా ఏకగ్రీవం చేసేందుకు అంగీకరించినట్లు సమాచారం. గతంలో కూడా ఇదే గ్రామంలో రూ.21 లక్షల విరాళం ప్రతిపాదనతో సర్పంచ్‌ను ఇదే తరహాలో ఎంపిక చేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయితే, గ్రామాభివృద్ధి పేరుతో నిర్వహించిన ఈ ఎంపిక విధానంపై చట్టపరమైన సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలో పంచాయతీ ఎన్నికలు పూర్తిగా ఎన్నికల సంఘం నిబంధనలు, రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టాల ప్రకారమే జరగాల్సి ఉంటుంది. గ్రామస్తులు తమ స్థాయిలో నిర్వహించుకున్న ఈ రకమైన వేలం లేదా టెండర్ విధానాలకు చట్టబద్ధమైన గుర్తింపు ఉండదు. ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ, అధికారిక పరిశీలన వంటి ప్రక్రియలు పూర్తయిన తర్వాతే ప్రజాస్వామ్యబద్ధంగా సర్పంచ్ ఎన్నిక చెల్లుబాటు అవుతుంది.

ఇంజినీరింగ్ కనీస ఫీజు పెంపు

మంత్రి లోకేశ్‌కు అపెక్మా కృతజ్ఞతలు

ఇంజినీరింగ్ కనీస ఫీజు రూ.40 వేల నుంచి రూ.47 వేలకు పెంపు

ప్రభుత్వానికి, మంత్రి లోకేశ్‌కు ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాల సంఘం కృతజ్ఞతలు

రెండు నెలల్లో కొత్త బ్లాక్ పీరియడ్ పూర్తి ఫీజుల ఖరారు

నెలకు రూ.400 కోట్ల రీయింబర్స్ నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి

విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేయవద్దని కాలేజీలకు ఆదేశం



ఆంధ్రప్రదేశ్‌లోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల కనీస ఫీజును ప్రభుత్వం పెంచింది. ఇప్పటివరకు రూ. 40,000గా ఉన్న కనీస వార్షిక ఫీజును రూ. 47,000కు సవరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ తాత్కాలిక ఫీజు పెంపు నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాల సంఘం (అపెక్మా) స్వాగతించింది. ఇంజినీరింగ్ కళాశాలల స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని ఫీజును సవరించినందుకు కూటమి ప్రభుత్వానికి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు అపెక్మా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. రాబోయే 2026--29 కొత్త బ్లాక్ పీరియడ్‌కు సంబంధించిన పూర్తి ఫీజుల వివరాలను రానున్న రెండు నెలల్లో ప్రభుత్వం ఖరారు చేయనుందని

చలికాలంలో "ఇమ్యూనిటీ" ఎందుకు తగ్గుతుంది

రోగనిరోధక శక్తిని పెంచడానికి ఈ విటమిన్లు మంచివట!

వింటర్‌లో కామన్‌గా జలుబు, దగ్గు, ఫ్లూ వంటి సమస్యలు

వీటికి రోగనిరోధక శక్తి తగ్గడమే కారణం

మరి ఇమ్యూనిటీని పెంచుకునేందుకు ఏ ఫుడ్స్ బెస్ట్!



చలికాలం స్టార్ట్ అయ్యింది. ఇక ఈ సీజన్‌లో జలుబు, దగ్గు, ఫ్లూ వంటి సమస్యలు చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అందరినీ ఇబ్బందిపెడతాయి. ఈ సమస్యలకు రోగనిరోధక శక్తి తగ్గడం ప్రధానం కారణం. ఎందుకంటే ఇతర కాలాలతో పోలిస్తే వింటర్‌లో ఇమ్యూనిటీ సహజంగానే కొంత బలహీనపడుతుంది. వైద్య నిపుణులు, శాస్త్రీయ పరిశోధనలు కూడా ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అయితే చలికాలంలో రోగనిరోధక శక్తిని పెంచుకుని ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారాన్ని తీసుకోవాలని, ముఖ్యంగా కొన్ని విటమిన్లుండే పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు. అవేంటో ఇప్పుడు చూద్దాం.ఇతర కాలాలతో పోలిస్తే చలికాలంలో వాతావరణ మార్పుల కారణంగా శరీరంలో పలు మార్పులు చోటుచేసుకుంటాయని, దీని వల్ల ఇమ్యూనిటీ తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చల్లని గాలి పీల్చినప్పుడు ముక్కు లోపల ఉష్ణోగ్రత తగ్గుతుందని, ఫలితంగా ముక్కులో ఉండి వైరస్‌లను అడ్డుకునే రక్షణ కణాల సామర్థ్యం దాదాపు సగానికి తగ్గిపోతుందంటున్నారు. అలాగే గాలిలో తేమ శాతం తగ్గడం వల్ల ముక్కు, గొంతు పొరలు పొడిబారి వైరస్‌లు సులభంగా శరీరంలోకి ప్రవేశిస్తాయంటున్నారు. అలాగే, ఎండ తక్కువగా తగలడం వల్ల శరీరంలో విటమిన్ ణ లోపం ఏర్పడి రోగనిరోధక వ్యవస్థ మందగిస్తుందని వివరిస్తున్నారు.

విటమిన్ సి: మానవ శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడే విటమిన్లలో విటమిన్ సి కీలక పాత్ర పోషిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ విటమిన్ లోపిస్తే త్వరగా జబ్బు పడే అవకాశాలుంటాయని హెచ్చరిస్తున్నారు. అందుకే రోజు వారి ఆహారంలో విటమిన్ 'సి' పుష్కలంగా లభించే కమలా, నిమ్మకాయ.. వంటి సిట్రస్ పండ్లను భాగం చేసుకోవడం ముఖ్యమంటున్నారు. వీటితో పాటు పాలకూర, క్యాప్సికం వంటి వాటిని కూడా చేర్చుకోవాలని సూచిస్తున్నారు.

విటమిన్ బి6: ఇమ్యూన్ వ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో విటమిన్ 'బి6' సహకరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా వైరస్‌లు, బ్యాక్టీరియాలతో పోరాడటానికి సహాయపడే తెల్ల రక్త కణాలు, టి కణాలను ఉత్పత్తి చేయడంలో ఇది ప్రధాన పాత్ర పోషిస్తుందంటున్నారు . ఈ క్రమంలోనే ఇది అధికంగా లభించే అరటిపండ్లు, బంగాళాదుంపలు, చికెన్, చేపలు, శనగలు, టోఫు వంటి ఆహార పదార్థాల్ని రోజువారీ మెనూలో చేర్చుకోవాలని సలహా ఇస్తున్నారు.

విటమిన్ ఇ: ఇది శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్ అని, శరీరం ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి ఎంతగానో సహాయపడుతుందని వివరిస్తున్నారు. అలాగే రోగనిరోధక వ్యవస్థను పటిష్టపరచడంలోనూ సహకరిస్తుందంటున్నారు. కాబట్టి ఇది ఎక్కువగా లభించే సన్‌ఫ్లవర్ గింజలు, పల్లీలు, బాదంపప్పులు, పాలకూర, బ్రోకలీ, అవకాడో వంటి వాటిని రోజువారీ డైట్‌లో చేర్చుకోవాలంటున్నారు.

విటమిన్ ఎ: ఈ విటమిన్‌లోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే ఇది కంటి ఆరోగ్యానికి కూడా మంచిదంటున్నారు. కాబట్టి క్యారెట్, తర్బూజా, గుమ్మడికాయ, చిలగడదుంప, పాలకూర, బ్రోకలీ, గుడ్లు, పాల పదార్థాలను తీసుకోవడం మంచిదంటున్నారు.

విటమిన్ డి: రోగనిరోధక వ్యవస్థ చురుగ్గా పనిచేయడానికి, దాని రక్షణకు విటమిన్ 'డి' ఎంతగానో తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే దీని వల్ల ఎముకలు కూడా దృఢంగా మారతాయని చెబుతున్నారు. కాబట్టి ఈ విటమిన్‌ను పొందడానికి ఆహారం కన్నా ఉదయాన్నే లేలేత ఎండలో 10 నుంచి 30 నిమిషాల పాటు సమయం గడపాలంటున్నారు. అలాగే ఇది అధికంగా లభించే చేపలు, కోడిగుడ్లు వంటివి ఎక్కువగా తీసుకోవాలంటున్నారు. ఈ విటమిన్లతో పాటు జింక్, సెలీనియం అధికంగా కలిగిన ఆహారాలను కూడా తమ డైట్‌లో చేర్చుకోవాలంటున్నారు.

వీగన్ డైట్‌తో బరువు తగ్గొచ్చా - నిపుణుల సమాధానమిదే!

ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది ఇబ్బందిపడే ఆరోగ్య సమస్యల్లో అధిక బరువు ఒకటి



అధిక బరువు.. ప్రస్తుత రోజుల్లో ఈ పేరు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా అధిక సంఖ్యలో ప్రజలు ఈ సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. ఈ విషయాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా స్పష్టం చేసింది. అందుకే చాలా మంది ఆరోగ్యకరమైన బరువును మెయింటైన్ చేసేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అందులో ప్రధానమైనది ఆహారంలో మార్పులు చేసుకోవడం. ముఖ్యంగా ఇటీవల కాలంలో బరువు తగ్గేందుకు వీగన్ డైట్‌ను ఫాలో అవుతున్నారు చాలా మంది. ఈ క్రమంలోనే అసలు వీగన్ డైట్ అంటే ఏంటి దీనిని వాడితే నిజంగానే బరువు తగ్గుతారా అనే వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.ఇటీవల కాలంలో వీగన్ డైట్ బాగా ప్రాచుర్యం పొందింది. దీని అర్థం మాంసం, గుడ్లతో పాటు పాలు, జంతువుల నుంచి ఉత్పత్తయ్యే పదార్థాలను మానేసి, కేవలం మొక్కల నుంచి లభించే సహజసిద్ధ ఆహార పదార్థాలను మాత్రమే మెనూలో చేర్చుకోవడం.వీగన్ డైట్ పాటించేవారిలో బాడీ మాస్ ఇండెక్స్ (దీవీ×) తక్కువగా ఉందని పలు పరిశోధనలు స్పష్టం చేస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం మాంసాహారం కంటే వీగన్ డైట్ పాటించేవారు ఎక్కువ బరువు తగ్గినట్లు వెల్లడైంది. ఇందులో దాదాపు 2,890 మందిపై జరిగిన 27 క్లినికల్ ట్రయల్స్‌ను పరిశోధకులు విశ్లేషించారు. మాంసాహార, ఇతర డైట్లతో పోలిస్తే వీగన్ డైట్ పాటించిన వారిలో బరువు తగ్గడం అనేది అత్యధికంగా ఉన్నట్లు ఈ పరిశోధనలో తేలింది. మొక్కల ఆధారిత ఆహారంలో కేలరీల సాంద్రత తక్కువగా ఉండటం, కొలెస్ట్రాల్ లేకపోవడం, పేగులలో మేలు చేసే బ్యాక్టీరియా వృద్ధి చెందడం వంటి కారణాల వల్ల శరీరంలో కొవ్వు వేగంగా కరుగుతోందని, ఫలితంగా బరువు తగ్గొచ్చని చెబుతున్నారు.వీగన్ డైట్ ద్వారా కేవలం బరువు తగ్గడమే కాకుండా ఇతర ప్రయోజనాలు లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా క్యాన్సర్, ఇస్కీమిక్ రకం స్ట్రోక్, శరీరంలో వాపు, కొలెస్ట్రాల్, టైప్-2 మధుమేహం, కంటి శుక్లాలు వంటి సమస్యలు తగ్గుతాయంటున్నారు.

బరువు తగ్గేందుకు తీసుకోవాల్సిన వీగన డైట్:

ప్రొటీన్ కోసం: సోయా , క్వినోవా, టెంపే

విటమిన్ ణ కోసం: సోయా అండ్ బాదం పాలు

ఒమేగా-3 కొవ్వు ఆమ్లాల కోసం: అవిసె, చియా, వాల్‌నట్స్ వంటి సీడ్స్ అండ్ నట్స్.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి: వీగన్ డైట్ ద్వారా బరువు తగ్గాలనుకునేవారు పలు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. అవేంటంటే..

తక్కువ కేలరీలు ఉండే కూరగాయలను ఎక్కువ నూనె ఉపయోగించి కుక్ చేస్తే వాటిలో కొవ్వు, కేలరీలు విపరీతంగా పెరుగుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి మితంగా వాడాలని సూచిస్తున్నారు.ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే పదార్థాలను తీసుకోవాలంటున్నారు. ముఖ్యంగా అవకాడో. ఎందుకంటే పండ్లలో కేలరీలు కొంచెం ఎక్కువగా ఉన్నా, అవి ఎక్కువ సేపు ఆకలి వేయకుండా ఉంచుతాయని, ఇందులోని పోషకాలు గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయంటున్నారు.కేవలం డైట్ మాత్రమే కాకుండా వ్యాయామం కూడా ముఖ్యమే అంటున్నారు నిపుణులు. ఎక్కువ సేపు కూర్చోకుండా మధ్యమధ్యలో నడవడం, భోజనం తర్వాత కాసేపు అడుగులు వేయడం అలవాటు చేసుకోవాలంటున్నారు. అలాగే కుకింగ్ లేదా గార్డెనింగ్ వల్ల శరీరానికి వ్యాయామం లభించడమే కాకుండా కొత్త రకాల వీగన్ వంటకాలపై ఆసక్తి పెరుగుతుందంటున్నారు.లైట్ ఫుడ్ కదా అనే ఒకేసారి కడుపునిండా తినకూడదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలోనే రోజులో తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తినడం అలవాటు చేసుకోవాలని చెబుతున్నారు. దీని వల్ల జీవక్రియ మెరుగుపడుతుందంటున్నారు.

కొన్ని రోజులు స్వీట్లు ఎక్కువగా తిన్నారా రక్తంలో షుగర్‌పై ఎంతకాలం ప్రభావం ఉంటుంది

కొన్నిరోజుల పాటు అధికంగా చక్కెర తీసుకోవడం వల్ల కాలేయంలో కొవ్వు పెరిగే ఛాన్స్

ఇన్సులిన్ స్పందనపై ప్రభావం పడే అవకాశం ఉందంటున్న నిపుణులు

ప్రీడయాబెటిస్, మధుమేహం ఉన్నవారు మరింత జాగ్రత్త

షుగర్ ఎక్కువగా ఉంటే ఫాస్టింగ్ గ్లూకోజ్, హెచ్‌బీఏ1సీ పరీక్షలు తప్పనిసరి



పండగలు, పెళ్లిళ్లు, వేడుకలు.. సందర్భం ఏదైనా తీపి పదార్థాలు కనిపిస్తే ఆగడం కష్టమే. ఒకట్రెండు రోజులు కాదు.. వరుసగా కొన్ని రోజుల పాటు స్వీట్లు, కూల్‌డ్రింక్స్, ఇతర తీపి పదార్థాలు అధికంగా తీసుకుంటుంటారు. ఆ తర్వాత మళ్లీ పాత ఆహారపు అలవాట్లకు మారిపోతారు. అయితే అప్పటికీ రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా కనిపిస్తే ఆందోళన చెందాల్సిందేనా కొన్ని రోజుల పాటు చక్కెర అధికంగా తీసుకోవడం వల్ల శరీరంలో జీవక్రియపై ప్రభావం పడుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే అందరిలోనూ ఈ ప్రభావం ఒకేలా ఉండదని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఇప్పటికే ప్రీడయాబెటిస్, మధుమేహం ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.మనం తీసుకునే ఆహారంలోని కార్బోహైడ్రేట్లు జీర్ణమైనప్పుడు గ్లూకోజ్‌గా మారి రక్తంలో కలుస్తాయి. దీంతో భోజనం తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. శరీరంలో ఇన్సులిన్ తగినంతగా ఉత్పత్తి అవుతూ, కణాలు దానికి సరిగ్గా స్పందిస్తే గ్లూకోజ్ స్థాయిలు క్రమంగా తగ్గుతాయి. ఆరోగ్యవంతుల్లో సాధారణంగా భోజనం చేసిన రెండు నుంచి మూడు గంటల్లో రక్తంలో చక్కెర స్థాయిలు భోజనానికి ముందున్న స్థాయికి చేరుకుంటాయి. అయితే మధుమేహం, ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఉన్నవారిలో ఈ ప్రక్రియ ఆలస్యం కావచ్చు. చక్కెరతో పాటు మొత్తం కేలరీలు ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయం పనితీరుపై ప్రభావం పడే అవకాశం ఉంది. స్విట్జర్లాండ్‌లోని లౌసాన్ యూనివర్సిటీ పరిశోధకులు నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ఆరోగ్యవంతులైన వ్యక్తులకు ఆరు నుంచి ఏడు రోజుల పాటు అధిక మోతాదులో ఫ్రక్టోజ్, గ్లూకోజ్ అందించి పరిశీలించారు. దీంతో కాలేయంలో కొవ్వు నిల్వలు పెరిగాయి. ఇన్సులిన్‌కు కాలేయం స్పందించే సామర్థ్యం కూడా తగ్గినట్లు గుర్తించారు.అయితే ఈ పరిశోధనలో ఉపయోగించిన చక్కెర పరిమాణం చాలా ఎక్కువ. సాధారణంగా పండగల్లో ఒకట్రెండు రోజులు స్వీట్లు తినే పరిస్థితిని ఈ ఫలితాలతో నేరుగా పోల్చలేం. అంతేకాదు.. ఈ మార్పులు ఎంతకాలం కొనసాగుతాయనే విషయాన్ని కూడా ఈ అధ్యయనం నిర్ధారించలేదు. డయాబెటిస్ వచ్చే ముందు దశలో ఉన్నవారికి రక్తంలో చక్కెరను నియంత్రించే సామర్థ్యం ఇప్పటికే కొంత బలహీనంగా ఉంటుంది. ఇన్సులిన్ రెసిస్టెన్స్ కారణంగా శరీర కణాలు ఇన్సులిన్‌కు సరిగ్గా స్పందించవు. ఇలాంటి పరిస్థితుల్లో అధికంగా ఆహారం తీసుకోవడం వల్ల గ్లూకోజ్ నియంత్రణ మరింత కష్టమవుతుంది.భోజనం తర్వాత షుగర్ పెరగడాన్ని సహజమైన ప్రక్రియగా నిపుణులు వివరిస్తున్నారు. అయితే అది ఎంత పెరుగుతోంది ఎంతసేపటికి తగ్గుతోంది అన్నది ముఖ్యమని చెబుతున్నారు. భోజనం తర్వాత తరచూ 180 ఎన్‌జీ/ఎంఎల్ కంటే ఎక్కువగా నమోదవుతున్నా, ఎక్కువసేపు తగ్గకపోయినా వైద్యులను సంప్రదించాలి. తెల్ల చక్కెర మానేసి బెల్లం, తేనె లేదా బ్రౌన్ షుగర్ తీసుకుంటే రక్తంలో గ్లూకోజ్ పెరగదని అనుకోవడం పొరపాటు. ఇవి కూడా కార్బోహైడ్రేట్ల వనరులే. అలాగే స్వీట్లు మానేసినా అన్నం, బ్రెడ్, బంగాళాదుంపలు వంటి పదార్థాలను అధికంగా తీసుకుంటే షుగర్ స్థాయిలు పెరగవచ్చు. అందుకే ఏ పదార్థం తింటున్నామన్నదే కాకుండా ఎంత పరిమాణంలో తీసుకుంటున్నామన్నది కూడా ముఖ్యం.స్వీట్లు, చక్కెర కలిపిన పానీయాలను తగ్గించాలి. అన్నం, ఇతర కార్బోహైడ్రేట్ల పరిమాణాన్ని నియంత్రించాలి.పప్పులు, కూరగాయలు, ప్రొటీన్ ఉండే సమతుల ఆహారం తీసుకోవాలి. పండ్ల రసాలకు బదులుగా పండ్లను నేరుగా తినాలి. భోజనం తర్వాత వీలైతే 10--15 నిమిషాలు నడవాలి. తగినంత నిద్రపోవాలి. శారీరక శ్రమను కొనసాగించాలి.సాధారణ ఆహారపు అలవాట్లకు తిరిగి మారిన తర్వాత కూడా షుగర్ స్థాయిలు ఎక్కువగా నమోదవుతుంటే నిర్లక్ష్యం చేయకూడదు. ఫాస్టింగ్ ప్లాస్మా గ్లూకోజ్ 126 ఎన్‌జీ/ఎంఎల్ లేదా అంతకంటే ఎక్కువగా ఉంటే డయాబెటిస్ ఉండే అవకాశం ఉంది. హెచ్‌బీఏ1సీ పరీక్ష ద్వారా గత మూడు నెలల్లో రక్తంలో సగటు చక్కెర స్థాయిలను అంచనా వేయవచ్చు. ప్రయోగశాల పరీక్షలతో వైద్యులు నిర్ధారించాలి.తరచూ దాహం వేయడం, ఎక్కువసార్లు మూత్ర విసర్జన, అకస్మాత్తుగా బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపించినా వైద్య సలహా తీసుకోవాలి. వాంతులు, కడుపునొప్పి, లోతైన శ్వాస, తీవ్రమైన నిద్రమత్తు వంటి లక్షణాలు కనిపిస్తే అత్యవసర వైద్య సహాయం అవసరం.

క్యాన్సర్‌కు చూయింగ్‌గమ్‌తో చెక్

వైద్యరంగంలో సంచలన ఆవిష్కరణ!

క్యాన్సర్‌కు కారణమయ్యే వైరస్‌ను ఎదుర్కొనేలా ప్రత్యేక చూయింగ్‌గమ్

అమెరికాలోని పెన్సిల్వేనియా యూనివర్సిటీ శాస్త్రవేత్తల ఆవిష్కరణ

చిక్కుడు జాతి గింజలతో తయారీ

లాలాజలంలో 93 శాతం వైరస్‌ను నిర్మూలించిన వైనం

నోటి క్యాన్సర్‌కు కారణమయ్యే బ్యాక్టీరియాను 99 శాతం మేర అంతం చేస్తున్నట్లు గుర్తింపు

త్వరలో మనుషులపై క్లినికల్ ట్రయల్స్ ప్రారంభించేందుకు సన్నాహాలు



పిల్లలు చూయింగ్‌గమ్ నములుతుంటే పెద్దలు మందలించడం సహజం. కానీ, అదే చూయింగ్‌గమ్‌తో ప్రాణాంతక క్యాన్సర్‌కు చికిత్స అందించవచ్చని అమెరికా శాస్త్రవేత్తలు నిరూపిస్తున్నారు. పెన్సిల్వేనియా యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు చిక్కుడు జాతి గింజల (లాబ్‌లాబ్ బీన్స్) పొడితో తయారుచేసిన ఒక ప్రత్యేక చూయింగ్‌గమ్‌తో క్యాన్సర్ కారక వైరస్‌లు, బ్యాక్టీరియాలను సమర్థంగా అడ్డుకోవచ్చని తేల్చారు. ఈ ఆవిష్కరణ క్యాన్సర్ చికిత్సా రంగంలో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది.తల, మెడ, గొంతు వంటి పలు రకాల క్యాన్సర్లకు ప్రధాన కారణమైన 'హ్యూమన్ పాపిలోమా వైరస్' (హెచ్‌పీవీ)ను ఈ చూయింగ్‌గమ్ లక్ష్యంగా చేసుకుంటుంది. ప్రముఖ బయోకెమిస్ట్ డాక్టర్ హెన్రీ డేనియల్ నేతృత్వంలోని బృందం ఈ పరిశోధనను చేపట్టింది. వారు క్యాన్సర్ రోగుల నుంచి సేకరించిన లాలాజల నమూనాలతో ప్రయోగాలు నిర్వహించారు. చిక్కుడు గింజల పొడిలోని 'ఎఫ్ఎల్‌టీ3' అనే ప్రోటీన్‌తో కూడిన చూయింగ్‌గమ్‌ను ఉపయోగించగా, అది హెచ్‌పీవీ వైరస్‌కు అతుక్కుని దాన్ని నిర్వీర్యం చేసింది. ఫలితంగా, కేవలం కొంత సమయం నమిలిన తర్వాత రోగుల లాలాజలంలో వైరస్ తీవ్రత 93 శాతం మేర తగ్గినట్లు గుర్తించారు.ఈ పరిశోధనలో భాగంగా శాస్త్రవేత్తలు మరో రకం చూయింగ్‌గమ్‌ను కూడా పరీక్షించారు. 'ప్రొటీగ్రిన్-1' అనే పెప్టైడ్‌తో తయారుచేసిన ఈ గమ్, నోటి క్యాన్సర్‌కు కారణమయ్యే ప్రమాదకర బ్యాక్టీరియాను లక్ష్యంగా చేసుకుంది. కేవలం ఒకేసారి నమలడంతోనే ఇది 99 శాతం బ్యాక్టీరియాను అంతం చేసినట్లు వెల్లడైంది. ఈ అధ్యయన వివరాలను ప్రముఖ సైన్స్ జర్నల్ 'బయోమెటీరియల్స్' ప్రచురించింది. చిక్కుడు గింజల నుంచి ఈ ప్రత్యేక ప్రొటీన్లను ఉత్పత్తి చేయడం తక్కువ ఖర్చుతో కూడుకున్నదని, గది ఉష్ణోగ్రత వద్ద కూడా ఇవి నిల్వ ఉంటాయని శాస్త్రవేత్తలు తెలిపారు. ల్యాబ్ పరీక్షల్లో అద్భుతమైన ఫలితాలు రావడంతో, తదుపరి దశలో అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) అనుమతితో నేరుగా మనుషులపై క్లినికల్ ట్రయల్స్ నిర్వహించేందుకు ఈ బృందం సిద్ధమవుతోంది. కీమోథెరపీ, రేడియేషన్ వంటి చికిత్సలు తీసుకునే రోగులలో నోటి ఇన్ఫెక్షన్లను నివారించడానికి, క్యాన్సర్ వ్యాప్తిని ప్రాథమిక దశలోనే అడ్డుకోవడానికి ఈ చూయింగ్‌గమ్ ఒక సులభమైన, చవకైన మార్గంగా మారుతుందని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

20-20-20 ట్రెడ్‌మిల్ ఛాలెంజ్

పొట్ట కొవ్వు నిజంగా తగ్గుతుందా

20 శాతం ఇన్‌క్లైన్‌పై 20 నిమిషాలు నడవడం వల్ల కేలరీల ఖర్చు

కాళ్ల కండరాల బలం, గుండె సామర్థ్యం మెరుగుపడే ఛాన్స్

పొట్ట కొవ్వు మాత్రమే తగ్గదంటున్న నిపుణులు

మొత్తం శరీర కొవ్వు తగ్గితేనే నడుము చుట్టూ మార్పు



పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వు తగ్గించుకోవాలంటే గంటల తరబడి జిమ్‌లో గడపాల్సిన అవసరం లేదా రోజూ 20 నిమిషాల నడకతోనే మంచి ఫలితాలు సాధించవచ్చా ప్రస్తుతం ట్రెండ్ అవుతున్న 20-20-20 ట్రెడ్‌మిల్ ఛాలెంజ్ ఇదే ప్రశ్నను ముందుకు తెస్తోంది. అయితే ఇది నిజంగా పొట్ట కొవ్వును తగ్గిస్తుందా నిపుణులు, పరిశోధనలు ఏం చెబుతున్నాయో తెలుసుకుందాం..ట్రెడ్‌మిల్‌ను 20 శాతం ఇన్‌క్లైన్‌లో ఉంచి 20 నిమిషాల పాటు నడవాలి. ఇలా 20 రోజులపాటు చేయాలి. వాలులో నడిచేటప్పుడు పిరుదులు, తొడలు, పిక్కల కండరాలు ఎక్కువగా పనిచేస్తాయి. గుండె, ఊపిరితిత్తులపైనా ఒత్తిడి పెరుగుతుంది. ఫలితంగా సాధారణ నడక కంటే ఎక్కువ శక్తి ఖర్చవుతుంది.ఇన్‌క్లైన్ వాకింగ్ వల్ల పొట్ట దగ్గర కొవ్వు మాత్రమే ప్రత్యేకంగా కరగదు. శరీరంలోని మొత్తం కొవ్వు తగ్గినప్పుడు పొట్ట చుట్టూ కొవ్వు కూడా తగ్గుతుంది. 2025లో ప్రచురితమైన ఓ సమీక్షలో 591 మంది అధిక బరువు ఉన్నవారిపై జరిగిన 12 అధ్యయనాలను పరిశీలించారు. వ్యాయామం వల్ల పొట్టలోని అంతర్గత కొవ్వు, చర్మం కింద ఉండే కొవ్వు తగ్గినట్లు గుర్తించారు. అయితే ఈ పరిశోధన ప్రత్యేకంగా 20-20-20 ఛాలెంజ్‌పై జరగలేదు.మరో అధ్యయనంలో 22 మంది యువకులు 20 నిమిషాల పాటు 20 శాతం ఇన్‌క్లైన్‌పై నడవగా సగటున 171 కేలరీలు ఖర్చయ్యాయి. సమతలంపై జాగింగ్‌తో పోలిస్తే గుండె స్పందన, ఆక్సిజన్ వినియోగం, కేలరీల ఖర్చు దాదాపు సమానంగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు.

ఇన్‌క్లైన్ వాకింగ్‌తో ప్రయోజనాలు

కేలరీల ఖర్చు: వాలులో నడవడానికి ఎక్కువ శ్రమ అవసరం. దీంతో శక్తి వినియోగం పెరుగుతుంది.

కండరాలకు బలం: పిరుదులు, తొడలు, పిక్కల కండరాల పనితీరు మెరుగుపడతాయి.

గుండె ఆరోగ్యం: గుండె, ఊపిరితిత్తుల సామర్థ్యం పెరిగేందుకు తోడ్పడుతుంది.

చక్కెర స్థాయిల నియంత్రణ: క్రమమైన వ్యాయామం ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

శారీరక సామర్థ్యం: మెట్లు ఎక్కడం, ఎక్కువ దూరం నడవడం వంటి పనులు సులభమవుతాయి.

20 శాతం ఇన్‌క్లైన్ అందరికీ సరిపోదు. ముఖ్యంగా వ్యాయామం అలవాటు లేనివారు మొదట 3-5 శాతం వాలుతో 10-15 నిమిషాలు నడవాలి. శరీరం అలవాటు పడిన తర్వాత క్రమంగా తీవ్రత పెంచుకోవాలి. ట్రెడ్‌మిల్ హ్యాండిల్స్‌ను పట్టుకుని ముందుకు వాలకుండా సహజమైన నడకను కొనసాగించాలి.రోజూ ఇదే వ్యాయామం చేయడం వల్ల పిక్కల కండరాలు, అకిలీస్ టెండన్‌పై అధిక ఒత్తిడి పడవచ్చు. అందుకే మధ్యలో విశ్రాంతి తీసుకోవాలి. తల తిరగడం, ఛాతీలో నొప్పి, అసాధారణంగా ఆయాసం లేదా కీళ్ల నొప్పులు వస్తే వెంటనే ఆపాలి. గుండె సమస్యలు, కీళ్ల సమస్యలు ఉన్నవారు ముందుగా వైద్యుల సలహా తీసుకోవాలి.వ్యాయామంతో పాటు ఆహార నియంత్రణ అవసరం. శరీరం ఖర్చు చేసే కేలరీల కంటే తక్కువగా తీసుకోవాలి. గుడ్లు, పప్పులు, చేపలు, పాల ఉత్పత్తుల వంటి ప్రొటీన్ ఆహారాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వారంలో కనీసం రెండు రోజులు కండరాల బలవర్ధక వ్యాయామాలు చేయాలి. తగినంత నిద్రపోవడంతో పాటు రోజంతా చురుగ్గా ఉండాలి.

అక్టోబర్ లో పెరిగిన ద్రవ్యోల్బణం.. వడ్డీ రేట్ల పెంపు ఖాయమేనా..!



అక్టోబర్ లో భారతదేశ హోల్‌సేల్ ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం పెరిగింది. సెప్టెంబర్ లో 11.39 శాతం ఉన్న ద్రవ్యోల్బణం అక్టోబర్ లో 12.29 శాతానికి చేరింది. ఇంధనం, విద్యుత్, ప్రాథమిక వస్తువులు, తయారీ ఉత్పత్తుల ధరలు పెరగడం దీనికి ప్రధాన కారణంగా అంచనా వేస్తున్నారు. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాత్కాలిక గణాంకాల ప్రకారం అక్టోబర్‌లో మొత్తం వస్తువుల డబ్ల్యూపీఐ 113.3 వద్ద ఉండగా.. సెప్టెంబర్‌లో ఇది 112.5గా ఉంది. ఇంధనం, విద్యుత్ విభాగంలో ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లోని 25.85 శాతం నుంచి అక్టోబర్‌లో 32.84 శాతానికి గణనీయంగా పెరిగింది. ప్రాథమిక వస్తువుల విభాగంలో ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లోని 8.67 శాతం నుంచి 9.24 శాతానికి చేరుకుంది. అయితే తయారీ ఉత్పత్తుల విభాగంలో ద్రవ్యోల్బణం అంతకుముందు నెలలోని 9.76 శాతం నుంచి 9.54 శాతానికి స్వల్పంగా తగ్గింది. అక్టోబర్‌లో ప్రాథమిక వస్తువులు సూచీ 120.6, ఇంధనం, విద్యుత్ సూచీ 115.7, తయారీ ఉత్పత్తుల సూచీ 110.2 వద్ద ఉన్నాయి. ఖనిజ నూనెలు, ముడి పెట్రోలియం, సహజ వాయువు, విద్యుత్, ఆహార పదార్థాలు, ప్రాథమిక లోహాలు, రసాయనాలు, రసాయన ఉత్పత్తులు, ఆహార ఉత్పత్తులు, ఆహారేతర వస్తువులు, వస్త్రాలు, అలాగే రబ్బరు, ప్లాస్టిక్ ఉత్పత్తులు ఈ నెలలో హోల్‌సేల్ ద్రవ్యోల్బణం పెరగడానికి ప్రధాన కారణాలుగా ప్రభుత్వం పేర్కొంది. విద్యార్థులకు గుడ్ న్యూస్.. తెలంగాణలో స్కూళ్లకు ప్రతి శనివారం సెలవు.. 5 రోజుల తరగతుల విధానంపై ప్రతిపాదన.. డబ్ల్యూపీఐ ఫుడ్ ఇండెక్స్ లో ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లోని 8.66 శాతం ఉండగా.. అక్టోబర్‌లో 8.58 శాతానికి తగ్గింది. ప్రాథమిక వస్తువుల పరిధిలోకి వచ్చే ఆహార పదార్థాలు, తయారీ ఆహార ఉత్పత్తులను కలిపి రూపొందించే ఈ ఫుడ్ ఇండెక్స్, లో దాదాపు 25 శాతం వెయిటేజీ ఉంటుంది. మరోవైపు రిటైల్ ద్రవ్యోల్బణం కూడా అక్టోబర్‌లో 6.09 శాతానికి పెరిగింది. గత రెండేళ్లలో తొలిసారిగా రిటైల్ ద్రవ్యోల్బణం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన అప్పర్ లిమిట్ 6 శాతాన్ని దాటింది. హోల్‌సేల్ అండ్ రిటైల్ ద్రవ్యోల్బణం రెండు రకాలుగానూ ఇలా ఎగబాకడం ఆర్థిక నిపుణుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితులతో రాబోయే డిసెంబర్ నెలలో జరిగే రిజర్వ్ బ్యాంక్ మానిటరీ పాలసీ సమావేశంలో కీలక వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉంది. పెరిగిపోతున్న ధరల కట్టడికి కేంద్ర బ్యాంకు ఎలాంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటుందనే దానిపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. ఆర్బీఐ ఇప్పటికే అక్టోబర్ లో రెపో రేటు పెంచింది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

ఆర్బీఐ కీలక నిర్ణయం 49 ఎన్బీఎఫ్సీల లైసెన్స్ రద్దు..!



ఆర్థిక విషయాల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కఠినంగా వ్యవహరిస్తోంది. తాజాగా దేశం లోని నాన్ బ్యాంకింగ్ ఫైనా న్షియల్ కంపెనీల రిజిస్ట్రేషన్ల విషయంలో ఆర్బీఐ కఠిన నిర్ణయం తీసుకుంది. మొత్తం 63 సంస్థలకు సంబంధించి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను రద్దు చేస్తూ కఠిన నిర్ణయం తీసుకుంది. వీటిలో 49 ఎన్‌బీఎఫ్‌సీల రిజిస్ట్రేషన్లను ఆర్బీఐ స్వయంగా రద్దు చేయగా, మరో 13 ఎన్‌బీఎఫ్‌సీలు, ఒక హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ (హెచ్‌ఎఫ్‌సీ) తమ రిజిస్ట్రేషన్లను సరెండర్ చేసింది. ఇందుకు సంబంధించి నవంబర్ 16న ఆర్బీఐ ప్రకటన విడుదల చేసింది. రిజర్వ్ బ్యాంక్ చట్టం, 1934లోని సెక్షన్ 45-ఐఏ (6) కింద 49 కంపెనీల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను రద్దు చేసినట్లు ప్రకటించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు 2026 అక్టోబర్ 1 నుంచి 29 మధ్య జారీ అయినట్లు పేర్కొంది. రిజిస్ట్రేషన్లను సరెండర్ చేసిన 14 సంస్థల్లో ఆరు కంపెనీలు ఎన్‌బీఎఫ్‌సీ వ్యాపారం నుంచి వైదొలిగినట్లు తెలిపింది. మరో ఐదు సంస్థలు ఆర్బీఐ నిర్దేశించిన నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ అవసరం లేని అన్‌రిజిస్టర్డ్ టైప్-1 ఎన్‌బీఎఫ్‌సీలుగా వర్గీకరణకు అర్హత సాధించినట్లు పేర్కొంది. మిగిలిన మూడు సంస్థలు విలీనం, రద్దు, స్వచ్ఛందంగా కంపెనీని మూసివేయడం వంటి కారణాలతో చట్టపరమైన ఉనికిని కోల్పోయాయని వివరించింది. రిజిస్ట్రేషన్లను సరెండర్ చేసిన సంస్థల్లో మనీష్ సింధటిక్స్, అమర్ ప్లాజా అండ్ హోల్డింగ్స్, వికానిక్ వ్యాపార్, రైట్ ట్రెజర్ ఫైనాన్స్ అండ్ లీజింగ్, బ్రావో క్యాపిటల్ సర్వీసెస్, సీజీఆర్ మర్కంటైల్ ఫైనాన్స్ ఉన్నాయి. రూ.10 వేలు దాటితే వెంటనే డబ్బులు వెళ్లవా.. గంట పాటు వెయిట్ చేయాల్సిందేనా. కొత్త ప్రతిపాదన.. అలాగే మనిభవ్నం హోమ్ ఫైనాన్స్ ఇండియా, సన్ సోర్స్ లీఫిన్, లియానర్ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థల రిజిస్ట్రేషన్లను అవి చట్టపరమైన సంస్థలుగా కొనసాగకపోవడంతో రద్దు చేసినట్లు ఆర్బీఐ పేర్కొంది. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు రద్దయిన సంస్థలు ఆర్బీఐ చట్టంలోని సెక్షన్ 45ప్రకారం ఎన్‌బీఎఫ్‌ఐ వ్యాపార కార్యకలాపాలను నిర్వహించడానికి వీలుండదని కేంద్ర బ్యాంక్ తెలిపింది. ఆర్‌బీఐ ఏదైనా ఎన్‌బీఎఫ్‌సీ లేదా హెచ్‌ఎఫ్‌సీ లైసెన్స్ రద్దు చేసినప్పుడు సామాన్య ప్రజలు కొన్ని ముఖ్యమైన విషయాలు తెలుసుకోవాల్సి ఉంటుంది. లైసెన్స్ రద్దయిన ఈ 63 సంస్థలు ఇకపై ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించడం గానీ, కొత్తగా ఎలాంటి రుణాలు ఇవ్వడం గానీ చేయకూడదని ఆర్బీఐ స్పష్టం చేసింది. మీరు గతంలో ఈ సంస్థల నుంచి ఏదైనా లోన్ తీసుకుని ఉంటే, లైసెన్స్ రద్దయినంత మాత్రాన మీ అప్పు మాఫీ కాదని గుర్తుంచుకోవాలి. పాత ఒప్పందం ప్రకారం మీరు మీ ఈఎంఐలను సక్రమంగా చెల్లించాల్సి ఉంటుంది. లేదంటే మీ సిబిల్ స్కోర్ దెబ్బతినే ప్రమాదం ఉంటుందని గమనించుకోవాలి. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

అక్టోబర్‌లో అత్యధిక పెట్టుబడులు ఆకర్షించిన స్మాల్ క్యాప్ మ్యూచువల్ ఫండ్లు ఇవే..!



అక్టోబర్‌లో స్మాల్-క్యాప్ పథకాలలో బంధన్ స్మాల్ క్యాప్ ఫండ్ అత్యధిక పెట్టుబడులను ఆకర్షించింది. కానీ పనితీరులో మాత్రం అంతగా ప్రభావం చూపలేకపోయింది. అక్టోబర్ లో ఇన్వెస్కో ఇండియా స్మాల్‌క్యాప్ మంచి సాధారణ పనితీరు కనబర్చింది. ఇది గణనీయంగా తక్కువ పెట్టుబడులను ఆకర్షించినప్పటికీ, ఇటీవలి కాలంలో మెరుగైన రాబడులను అందించింది. బంధన్, నిప్పన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్‌లు ఒక్కొక్కటి 260కి పైగా స్టాక్‌లను కలిగి ఉండగా, ఇన్వెస్కో కేవలం 74 స్టాక్‌లను మాత్రమే కలిగి ఉంది. దీంతో దాని పోర్ట్‌ఫోలియో గణనీయంగా మరింత కేంద్రీకృతమైంది. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా ప్రకారం స్మాల్-క్యాప్ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు సెప్టెంబర్‌లోని రూ. 9,039 కోట్ల నుంచి అక్టోబర్‌లో 29 శాతం తగ్గి రూ. 6,408 కోట్లకు పడిపోయింది. లార్జ్- మిడ్-క్యాప్ ఫండ్‌లు ఈ విభాగాన్ని అధిగమించి రూ. 8,484 కోట్లను ఆకర్షించాయి. బంధన్ ఫండ్ తర్వాత సమీర్ రాచ్ నిర్వహించే నిప్పన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ రూ. 722.57 కోట్లతో తర్వాతి స్థానంలో నిలవగా, తాహెర్ బాద్వా నిర్వహించే ఇన్వెస్కో ఇండియా స్మాల్‌క్యాప్ ఫండ్ రూ. 681.71 కోట్లను ఆకర్షించింది. ఈ మూడు కలిసి ఈ కేటగిరీలోని నికర పెట్టుబడుల మొత్తంలో దాదాపు 46 శాతం వాటాను కలిగి ఉన్నాయి. అక్టోబర్‌లో మ్యూచువల్ ఫండ్లు కొనుగోలు చేసిన లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్ ఇవే..! ఆస్తుల నిర్వహణ పరంగా నిప్పన్ ఇండియా రూ. 76,902.83 కోట్లతో ఈ మూడింటిలో అతిపెద్దదిగా నిలిచింది. ఇది బంధన్ ఫండ్ పరిమాణానికి రెండింతలు పైగా ఉంది. అక్టోబర్‌లో ఈ మూడు ఫండ్లూ ప్రతికూల రాబడులను నమోదు చేశాయి. కానీ నిప్పన్ ఇండియా 5.84 శాతం, బంధన్ 6.17 శాతం క్షీణించగా, ఇన్వెస్కో 3.05 శాతంతో అతి తక్కువ నష్టాన్ని చవిచూసింది. ఆరు నెలలు, ఒక సంవత్సరం రాబడి ఆలోచిస్తే ఇన్వెస్కో స్మాల్ క్యాప మంచి రాబడి అందించింది. ఆరు నెలల్లో 8.41 శాతం, సంవత్సరంలో 5.90 శాతం రాబడి అందించింది. బంధన్ ఫండ్ మూడేళ్లలో 19.99 శాతంతో అత్యంత బలమైన రాబడిని నమోదు చేసింది. ఐదేళ్ల కాలంలో, ఈ మూడు సంస్థలూ సుమారు 16-16.5 శాతం వార్షిక రాబడులను అందించాయి. సెబీ నిబంధనల ప్రకారం స్మాల్-క్యాప్ మ్యూచువల్ ఫండ్లు తమ ఆస్తులలో కనీసం 65 శాతాన్ని స్మాల్-క్యాప్ స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టాలి. బంధన్‌కు అత్యధికంగా 70.29 శాతం స్మాల్-క్యాప్ ఎక్స్‌పోజర్ ఉండగా, దాని తర్వాత నిప్పన్ ఇండియాకు 67.62 శాతం, ఇన్వెస్కోకు 62.66 శాతం ఉన్నాయి. ఇన్వెస్కోకు అత్యధికంగా 16.86 శాతం మిడ్-క్యాప్ కేటాయింపు ఉండగా, నిప్పన్ ఇండియాకు 13.09 శాతం, బంధన్‌కు 10.01 శాతం ఉన్నాయి. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

ఉద్యోగం దొరకక... రెండు నెలల జీతం ఆఫర్ చేసిన జెన్-జీ!



భారతదేశంలో ఉద్యోగాల కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. చదువు పూర్తి చేసుకున్న యువతకు అంత సులభంగా ఉద్యోగాలు దొరకడం లేదు. ఉద్యోగ మార్కెట్ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చెప్పేలా ఓ జెన్-జీ యువకుడు చేసిన ప్రకటన ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. బెంగళూరుకు చెందిన ఓ కంప్యూటర్ సైన్స్ గ్రాడ్యుయేట్, తనకు ఉద్యోగం ఇప్పించిన వారికి తన రెండు నెలల జీతాన్ని పూర్తిగా ఇచ్చేస్తానని రెడ్డిట్‌లో బహిరంగంగా ప్రకటించాడు. ఈ విషయం ఇప్పుడు నెటిజన్ల మధ్య పెద్ద చర్చకు దారితీసింది. చదువు పూర్తి చేసి ఉద్యోగం కోసం వెతుకుతున్న ఎందరో యువకుల్లాగే, ఇతను కూడా ఎన్నో కంపెనీలకు అప్లై చేశాడు. కానీ, స్క్రీనింగ్ ఫిల్టర్లు, తీవ్రమైన పోటీ కారణంగా కనీసం ఇంటర్వ్యూ కాల్స్ కూడా రావడం లేదని వాపోతున్నాడు. యాక్సెంచర్ బోనస్: షాకింగ్ ట్విస్ట్! జీతాల పెంపు కథ ఏమైంది సాధారణ పద్ధతిలో అప్లై చేస్తే ప్రయోజనం లేదని, తనకు లేదా సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం ఇప్పించిన వారికి నా మొదటి రెండు నెలల జీతాన్ని బహుమతిగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని పోస్ట్ చేశాడు. మామూలు రిఫరల్ రిక్వెస్ట్‌లను ఎవరూ పట్టించుకోకపోవడంతో, ఇలా వినూత్నంగా జీతాన్ని కమీషన్‌గా ఇస్తానని ప్రకటించి అందరి దృష్టిని ఆకర్షించాడు. తనకు సరైన కాంటాక్ట్స్ లేనందున, కంపెనీలలో పలుకుబడి ఉన్నవారు లేదా సరైన ఉద్యోగావకాశాల గురించి తెలిసిన వారు తనకు సహాయం చేయాలని అతను కోరాడు. ఈ జెన్-జీ యువకుడి వింత ప్రకటన ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. తో ఉద్యోగం కోల్పోయిన వారికి మళ్లీ ఆఫర్.. తిరిగి ఉద్యోగంలో చేరమంటున్న కంపెనీలు..కారణం ఏంటంటే.. ప్రస్తుత కఠినమైన జాబ్ మార్కెట్‌లో గ్రాడ్యుయేట్లు పడుతున్న బాధను ఇది స్పష్టంగా చూపిస్తోందని, ఉద్యోగం లేక ఇబ్బంది పడుతున్న వారు తమ నైపుణ్యాలను నిరూపించుకోవడానికి ఎలాంటి హద్దులకైనా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని ఇది తెలియజేస్తోందని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, అప్పుడే చదువు పూర్తి చేసుకున్న వ్యక్తి తన మొదటి జీతాన్ని వదులుకుంటానని చెప్పడం సరైనది కాదని, సరైన నెట్‌వర్కింగ్, ఓపికతో ఉద్యోగం వెతుక్కోవడమే సరైన మార్గమని కొందరు విమర్శిస్తున్నారు. అయితే, రాకతో ఎంట్రీ-లెవల్ ఉద్యోగాలు అంత సులభంగా దొరకడం లేదు. దీనివల్ల, ఉద్యోగం సంపాదించి ఒక కంపెనీలోకి అడుగుపెట్టడం అంత తేలికైన విషయం కాదు. ఈ యువకుడి పోస్ట్, నేటి టెక్నాలజీ రంగంలో ఉద్యోగాల కోసం పోటీ ఏ స్థాయికి చేరిందో, తమ భవిష్యత్తు కోసం యువత ఎలాంటి తీవ్రమైన ప్రయత్నాలకైనా వెనుకాడటం లేదో చూపిస్తోంది.

హైదరాబాదీలకు అలర్ట్.. నవంబర్ 30న ఆటోల బంద్..



మహాత్మా గాంధీ తెలంగాణ ఆటో డ్రైవర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నవంబర్ 30న హైదరాబాద్‌లో ఒక రోజు బంద్‌కు పిలుపునిచ్చింది. 15 రోజుల్లోగా సవరించిన ఆటో మీటర్ ఛార్జీలను అమలు చేయాలని, లేకపోతే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాజీనామా చేయాలన్నారు. నవంబర్ 15, ఆదివారం నాడు హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో విలేకరుల సమావేశంలో జేఏసీ కన్వీనర్ మహమ్మద్ అమానుల్లా ఖాన్ మాట్లాడారు. గ్రీన్ క్యాబ్‌లు తమ జీవితాలను నాశనం చేస్తున్నాయని ఆరోపిస్తూ, వాటిపై తక్షణమే నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. ఆటో బ్లాక్ మార్కెట్ రాకెట్‌పై ఉక్కు చర్య తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12,000 చొప్పున మొత్తం రూ.36,000 చెల్లించాలని కూడా కమిటీ డిమాండ్ చేశారు. బెంగళూరులో మాదిరిగా నగరంలో కూడా ద్విచక్ర వాహన ట్యాక్సీలను నిషేధించాలని ఆయన అన్నారు. సెప్టెంబర్‌లో దాడికి గురైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ ముకరం కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందించాలని కూడా ఈ సంస్థ కోరింది. అంతకుముందు, ఈ సంఘం ఆగస్టులో సమ్మెను ప్రకటించింది. కానీ రవాణా శాఖ మంత్రితో సమావేశం అనంతరం దానిని విరమించుకుంది. పొన్నం ప్రభాకర్ తమ డిమాండ్లకు సానుకూలంగా స్పందించారని జేఏసీ ఒక ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌కు వాటర్ షాక్.. నీటి కోసం మూడు రెట్లు అధికంగా చెల్లిస్తున్న బిల్దర్లు.. ఉచిత బస్సుల వల్ల తమ ఉపాధి తీవ్రంగా దెబ్బతిన్నదని ఆటో డ్రైవర్లు పేర్కొంటున్నారు. అందరు బస్సు ఎక్కి వెళ్లిపోవడం వల్ల ఇప్పుడు ఆటోలు ఎవరు ఎక్కడం లేదన చెబుతున్నారు. బస్సులు లేని ఏరియాల్లో మాత్రమే గిరాకీ ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఈ ట్యాక్సీలు వస్తే అందరూ తక్కువ ధరలో వచ్చే ట్యాక్స్ లు బుక్ చేసుకుంటారని.. ఫలితంగా తమ ఉపాధి మరింత దెబ్బతింటుందని చెబుతున్నారు. జిల్లా రిజిస్ట్రేషన్ ఆటోలను హైదరాబాద్ తిప్పుతున్నారని తెలిపారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే చాలా మంది ఆటో డ్రైవర్లు ఎక్కువ ధరలు తీసుకుంటున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

ఒక్క రోజే 13 శాతానికి పైగా పడిపోయిన కేన్స్ టెక్నాలజీ షేర్లు..!



కేన్స్ టెక్నాలజీ ఇండియా షేర్లు సోమవారం సెషన్‌లో 20 శాతం వరకు పతనమయ్యాయి. వరుస లోయర్ సర్క్యూట్‌లను తాకిన ఈ షేర్లు కొంత మేర పుంజుకుని నవంబర్ 16న 13.1 శాతం నష్టంతో ముగిశాయి. ఈ ఎలక్ట్రానిక్స్ తయారీ సేవల సంస్థ, ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో లాభం, ఆపరేటింగ్ మార్జిన్‌లలో భారీ క్షీణతను నివేదించింది. స్మార్ట్ మీటరింగ్ వ్యాపారం సరిగా లేకపోవడం, పెరుగుతున్న ఏకీకృత నికర అప్పు వల్ల నిరాశాజనకమైన ఆపరేటింగ్ పనితీరు కనబర్చిందని బ్రోకరేజ్ లు పేర్కొన్నాయి. కేన్స్ టెక్నాలజీ షేర్లు ఇంట్రాడే కనిష్ట స్థాయి రూ. 2,744 నుంచి కోలుకుని ఒక్కో షేరుకు రూ. 2,980 వద్ద స్థిరపడ్డాయి. ఇంట్రాడేలో ఈ షేరు 20 శాతం పడిపోయింది. మిడ్‌క్యాప్ సూచీలో ఈ కంపెనీ ఎక్కువగా నష్టపోయింది. 2026లో ఇప్పటివరకు ఈ స్టాక్ 24.4 శాతం నష్టపోయింది. ఇదే కాలంలో 3.3 శాతం క్షీణించిన బెంచ్‌మార్క్ నిఫ్టీ 50 కంటే ఇది చాలా వెనుకబడి ఉంది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 20,000 కోట్లకు పైగా కొనసాగుతోంది. నవంబర్ 15, ఆదివారం నాడు కంపెనీ తన 27 రెండో త్రైమాసిక ఆదాయాల ప్రకటనను విడుదల చేసిన తర్వాత షేర్ల అమ్మకాలు తీవ్రంగా జరిగాయి. గత ఏడాది ఇదే త్రైమాసికంలో రూ. 118.2 కోట్లుగా ఉన్న ఏకీకృత నికర లాభం, గతేడాదితో పోలిస్తే 61.6 శాతం తగ్గి రూ. 45.4 కోట్లకు పడిపోయింది. స్టాక్ మార్కెట్ క్లోజింగ్ బెల్.. పాత రికార్డును బద్దలు కొట్టిన బ్యాంక్ నిఫ్టీ.. లాభాల్లో ముగిసిన షేర్ మార్కెట్ కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం గతేడాది రూ. 912 కోట్ల నుంచి 4.4 శాతం స్వల్పంగా పెరిగి రూ. 952.2 కోట్లకు చేరింది. అయితే వడ్డీ, పన్ను, తరుగుదల, అమోర్టైజేషన్‌కు ముందు ఆదాయాలు 16.2 శాతం తగ్గి రూ. 150 కోట్ల నుంచి రూ. 125.6 కోట్లకు పడిపోయాయి. కంపెనీ ఎబిట్డా మార్జిన్ గతేడాది 16.4 శాతం నుంచి 13.2 శాతానికి పడునుగా తగ్గింది. సీఎల్ఎస్ఏ కేన్స్ టెక్నాలజీపై తన 'హోల్డ్' రేటింగ్‌ను కొనసాగించింది. ఒక్కో షేరుకు రూ. 3,580 లక్ష్య ధరను నిర్దేశించింది, ఇది శుక్రవారం ముగింపు ధర నుండి సుమారు 4 శాతం పెరుగుదలను సూచిస్తుంది. సమీకృత అంచనాలకు తగ్గట్టుగా లేదని, ఇది కంపెనీ స్మార్ట్ మీటరింగ్ విభాగమైన ఇస్క్రామెకోలో కార్యకలాపాలు తగ్గుముఖం పట్టిందని కంపెనీ బ్రోకరేజ్ పేర్కొంది. అయితే స్టాండ్‌అలోన్ వ్యాపారంలో గణనీయంగా బలమైన పనితీరును బ్రోకరేజ్ హైలైట్ చేసింది. ఇక్కడ ఎబిట్డా 46 శాతం పెరిగి, అంచనాలను మించిపోయింది. జేపీమోర్గాన్, కేన్స్ టెక్నాలజీపై తన 'న్యూట్రల్' రేటింగ్‌ను కొనసాగిస్తూ ఒక్కో షేరుకు రూ. 3,150 టార్గెట్ ధరను నిర్దేశించింది. ఇది శుక్రవారం ముగింపు ధర నుంచి దాదాపు 8 శాతం తగ్గుదలను సూచిస్తుంది. యాజమాన్యం నికర వర్కింగ్ క్యాపిటల్ అవసరాలను తగ్గించడంపై దృష్టి సారించడంతో, స్మార్ట్ మీటరింగ్ వ్యాపారం నుంచి వాటా తగ్గడమే ఆదాయాల నిరాశకు ప్రధాన కారణమని బ్రోకరేజ్ పేర్కొంది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.





ఆది సాయికుమార్ కొత్త సినిమా.. ఆసక్తిగా టైటిల్

ఆది సాయికుమార్ హీరోగా వస్తోన్న లేటేస్ట్ మూవీ అరుంధతి నక్షత్రం. ఈ చిత్రంలో మేఘ శెట్టి, మధు దామరాజు హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో డైరెక్టర్ రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని 7 పి.ఎం. ప్రొడక్షన్స్, శ్రీ చక్ర మూవీస్ ఎల్ఎల్పీ బ్యాసర్స్‌పై సందీప్ అగరం, అమ్మిత రెడ్డి బాసాని, డా.సూర్యకాంతి కూచిభొట్ల నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ షూటింగ్ హైదరాబాద్‌లో గ్రాండ్‌గా ప్రారంభమైంది. ఈ మూవీ పూజా కార్యక్రమంలో ముహూర్తపు సన్నివేశానికి సటుడు సాయి కుమార్ క్లాప్ ఇచ్చారు. ప్రొడ్యూసర్స్ రమేష్ పుప్పాల, సూర్యకాంతి కూచిభొట్ల కెమెరా స్విచ్ఛాన్ చేశారు. చిత్ర నిర్మాతలు స్క్రిప్ట్ అందించారు. ఈ మూవీ ఆది సాయికుమార్ కెరీర్‌లో 28వ సినిమాగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా అనౌన్స్ మెంట్ స్పెషల్ వీడియో గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ వీడియో చూస్తుంటే ఒక మంచి రూరల్ ఫ్యామిలీ డ్రామా అని అర్థమవుతోంది. ఈ నెలలోనే అరుంధతి నక్షత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి సురేశ్ బొబ్బిలి సంగీతమందిస్తున్నారు.

రామాయణం బాక్సాఫీస్ సునామీ.. సెకండ్ సండే రూ.75 కోట్ల వసూళ్లు ధురంధర్ 2 రికార్డు బద్దలు!



బాక్సాఫీస్ వద్ద 'రామాయణం పార్ట్ 1' ప్రభంజనం కొనసాగుతోంది. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ విజువల్ వండర్ కలెక్షన్ల విషయంలో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, నేచురల్ బ్యూటీ సాయి పల్లవి సీతాదేవిగా, రాకింగ్ స్టార్ యశ్ రావణుడిగా నటించిన ఈ చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. దీపావళి పండుగ సందర్భంగా విడుదలైన ఈ సినిమా మొదటి వారంలోనే భారీ వసూళ్లు సాధించగా, రెండో వారాంతంలోనూ అదే జోరును కొనసాగించింది. ముఖ్యంగా రెండో ఆదివారం నమోదైన కలెక్షన్లు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ క్రమంలోనే 'ధురంధర్ 2' పేరిట ఉన్న సెకండ్ సండే రికార్డును కూడా రామాయణం అధిగమించినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. 'రామాయణం' సినిమా రెండో వారాంతంలోనూ బాక్సాఫీస్ వద్ద తన ఆధిపత్యాన్ని చాటుకుంది. నవంబర్ 15, ఆదివారం ఈ చిత్రం భారతదేశంలో సుమారు రూ.75 కోట్ల నెట్ వసూళ్లు సాధించినట్లు సాక్నిల్క్ గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు శనివారం నమోదైన రూ.72.90 కోట్లతో పోలిస్తే ఆదివారం కలెక్షన్లు మరింత పెరగడం విశేషం. సాధారణంగా సినిమాలకు మొదటి వారాంతం తర్వాత వసూళ్లు తగ్గుతుంటాయి. అదే 'రామాయణం' విషయంలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. రెండో ఆదివారం కూడా ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో థియేటర్లకు రావడంతో ఈ సినిమా మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. రెండో ఆదివారం అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల జాబితాలో 'రామాయణం' సరికొత్త రికార్డును నమోదు చేసింది. ఇప్పటివరకు ఈ విషయంలో 'ధురంధర్ 2' సాధించిన రూ.68 కోట్ల వసూళ్లు రికార్డుగా ఉన్నాయి. అయితే రామాయణం రెండో ఆదివారం రూ.75 కోట్లు సాధించినట్లు వచ్చిన గణాంకాలతో ఆ రికార్డు బద్దలైంది. దీంతో రెండో ఆదివారం అత్యధిక కలెక్షన్లు సాధించిన సినిమాల జాబితాలో రామాయణం అగ్రస్థానానికి చేరినట్లు ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా రెండో వారంలోనూ కలెక్షన్లు పెరుగుతుండటం ఈ సినిమా బాక్సాఫీస్ బలాన్ని తెలియజేస్తోంది. 'రామాయణం' సినిమా వసూళ్ల జోరు ఇతర భారీ చిత్రాల లైఫ్‌టైమ్ కలెక్షన్లపై కూడా ప్రభావం చూపిస్తోంది. ఇప్పటివరకు ఈ చిత్రం భారతిలో సుమారు రూ.760.60 కోట్ల నెట్ వసూళ్లు సాధించినట్లు సాక్నిల్క్ గణాంకాలు వెల్లడించాయి. ఈ క్రమంలో షారుఖ్ ఖాన్ నటించిన 'జవాన్' రూ.643.87 కోట్ల లైఫ్‌టైమ్ నెట్ కలెక్షన్లను అధిగమించింది. అలాగే రాజ్‌కుమార్ రావ్ నటించిన 'స్త్రీ 2' రూ.625.27 కోట్లు, విక్కీ కౌశల్ 'ఛావా' రూ.601.57 కోట్లు, షారుఖ్ ఖాన్ 'పఠాన్' రూ.544.28 కోట్లు, రణ్‌బీర్ కపూర్ 'యానిమల్' రూ.556.36 కోట్ల వసూళ్లను కూడా దాటేసినట్లు సమాచారం. ఒకే సినిమాతో ఇన్ని భారీ చిత్రాల రికార్డులను అధిగమించడం ఇప్పుడు బాలీవుడ్‌లో పెద్ద చర్చగా మారింది.

తేజ సజ్జా నిశ్చితార్థం.. తెలంగాణ గవర్నర్ స్పెషల్ విషెస్



టాలీవుడ్ యువ హీరో తేజ సజ్జా త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నారు. ఆయన నిశ్చితార్థ వేడుక హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ తాజ్ కృష్ణ హోటల్‌లో ఘనంగా జరిగింది. ఇప్పటికే పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఈ వేడుకకు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. తాజాగా తెలంగాణ గవర్నర్ శివప్రతాపి శుక్లా సైతం ఈ వేడుకకు విచ్చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ శివప్రతాపి శుక్లా కాబోయే దంపతులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. వారి వైవాహిక జీవితం ప్రేమ, సంతోషం, సామరస్యంతో నిండాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు నెట్టింట సందడి చేస్తున్నాయి.



ఇంట్లో దెయ్యం ఉందని భయపడిన శృతి హాసన్..



కదిలే బొమ్మతో పణికిపోయా అంటూ షాకింగ్ కామెంట్స్!

దెయ్యాలు, ఆత్మలు, అతీంద్రియ శక్తులు ఉన్నాయా? లేవా? అనే ప్రశ్నకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు. పారానార్మల్ యాక్టివిటీస్ గురించి ప్రపంచవ్యాప్తంగా ఎన్నో కథలు, అనుభవాలు ప్రచారంలో ఉన్నాయి. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు కొందరు తమ జీవితాల్లో ఎదురైన వింత సంఘటనలను పలు సందర్భాల్లో వెల్లడించారు. తాజాగా ఈ జాబితాలో స్టార్ హీరోయిన్ శృతి హాసన్ కూడా చేరారు. తన ఇంట్లో ఓ బొమ్మ కారణంగా ఎదురైన భయానక అనుభవాన్ని ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఆ బొమ్మ తనకు నిద్రలేని రాత్రులను మిగిల్చిందని, చివరకు దాన్ని ఇంటి నుంచి బయటకు పంపించాల్సి వచ్చిందని వెల్లడించారు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తనకు ఎదురైన వింత అనుభవం గురించి శృతి హాసన్ మాట్లాడుతూ.. చెన్నైలోని తన ఇంట్లో కొన్ని సందర్భాల్లో ఏవో అదృశ్య శక్తులు ఉన్నట్లు అనిపించేదని చెప్పారు. అయితే ప్రతిసారీ ఇలాంటి అనుభవాలు ఎదురుకాలేదని, కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే వింత సంఘటనలు జరిగేవని వెల్లడించారు.తన దగ్గర మనిషి పరిమాణంలో ఉండే ఓ బొమ్మ ఉండేదని, దానికి ఫియోనా అని పేరు పెట్టుకున్నానని తెలిపారు. తన స్నేహితులు ఇంటికి వచ్చినప్పుడు కూడా ఆ బొమ్మను పలకరించేవారని చెప్పారు. అంతేకాకుండా ఆ బొమ్మను అల్మారాలో పెట్టి దానిపై రకరకాల బొమ్మలు గీస్తూ ఉండేవారట. మొదట్లో అదొక సాధారణ బొమ్మగానే భావించినప్పటికీ, ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనలు తనను తీవ్రంగా భయపెట్టాయని శ్రుతి వివరించారు. ఆ బొమ్మ విషయంలో తనకు ఎదురైన అత్యంత భయానక అనుభవాన్ని కూడా శ్రుతి హాసన్ వెల్లడించారు.

ఆకాశంలో ఓ తార ట్రైలర్ విడుదల.. అమ్మాయి కలకు అండగా దుల్కర్ సల్మాన్..!

మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ తెలుగు ప్రేక్షకులకు కూడా ఎంతో చేరువయ్యారు. ఆయన నటించే సినిమాలకు తెలుగులోనూ మంచి ఆదరణ లభిస్తోంది. ఈ క్రమంలో ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా తెలుగు చిత్రం 'ఆకాశంలో ఓ తార' ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. నవంబర్ 20న ఈ సినిమా తెలుగు, మలయాళం, హిందీ, తమిళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది. ఇప్పటికే ప్రమాషనల్ కంటెంట్‌తో ఆసక్తిని పెంచిన ఈ సినిమా.. ట్రైలర్‌తో ప్రేక్షకుల్లో మరింత అంచనాలను పెంచుతోంది. ఈ చిత్రంలో సాత్విక వీరవల్లి ..కల్పన అనే గ్రామీణ యువతి పాత్రలో కనిపించనుంది. చిన్న గ్రామంలో జీవించే కల్పనకు వ్యోమగామి కావాలనే పెద్ద కల ఉంటుంది. తన పరిస్థితులు, ఎదురయ్యే అడ్డంకులు ఎన్ని ఉన్నా ఆ లక్ష్యాన్ని సాధించాలని ఆమె పట్టుదలగా ప్రయత్నిస్తుంది. ఈ ప్రయాణంలో కృష్ణ అనే పాత్రలో నటించిన దుల్కర్ సల్మాన్ ఆమెకు అండగా నిలుస్తాడు. కల్పన కలను నిజం చేయడానికి కృష్ణ ఎలా తోడ్పడ్డాడు? ఆమె ఎదుర్కొన్న సవాళ్లను అధిగమించేందుకు ఎలా సహాయం చేశాడు? అనే అంతాల చుట్టూ ఈ కథ సాగనుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాల ద్వారా సినిమా కథలోని ప్రధాన అంతాలు ప్రేక్షకులకు కొంతవరకు పరిచయమయ్యాయి. తాజాగా వచ్చిన ట్రైలర్ మాత్రం కథలోని భావోద్వేగాలను మరింత బలంగా చూపించింది. ముఖ్యంగా ఓ సాధారణ గ్రామీణ అమ్మాయి అంతరిక్షంలోకి వెళ్లాలనే అసాధారణమైన కలను సాకారం చేసుకోవడానికి చేసే ప్రయత్నాలు ఆకట్టుకుంటున్నాయి. ఆమెకు అండగా నిలిచే కృష్ణ పాత్ర సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ట్రైలర్‌ను ఆసక్తికరంగా కట్ చేశారు. హృదయాన్ని తాకే సంభాషణలు, మనసుకు హత్తుకునే నేపథ్య సంగీతం కథకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. కల్పన కల, ఆమె ప్రయాణంలో ఎదురయ్యే కష్టాలు, కృష్ణ ఇచ్చే ధైర్యం.. ఇలా ప్రతి అంశాన్ని భావోద్వేగభరితంగా చూపించారు. ట్రైలర్ చూస్తుంటే వెండితెరపై ఈ కథను చూడాలనే ఆసక్తి కలుగుతోంది. ఈ సినిమాలో దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లితో పాటు శ్రుతి హాసన్, స్వాసిక, మురళీ శర్మ, రుహానీ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నటీనటుల ప్రదర్శనలు కూడా సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా కనిపిస్తున్నాయి. నిర్మాణ విలువలు రిచ్‌గా ఉండటంతో పాటు, కథకు తగ్గట్టుగా విజువల్సును రూపొందించినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. 'ఆకాశంలో ఓ తార' చిత్రానికి పవన్ సాదినేని దర్శకత్వం వహిస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్‌బాక్స్ మీడియా, వైజయంతీ మూవీస్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమా నవంబర్ 20న తెలుగు, మలయాళం, హిందీ, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

M/S ACHUKATLA PUBLICATIONS D.NO. 9/1542, M.R. ROAD, GOOTY RS, ANANTHAPUR, ANDHRA PRADESH - 515402.